Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 166 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 జూలై 2023 శుక్రవారం పేజీలు : 4

## గణనీయంగా తగ్గిన టమోటాల విక్రయం

చెన్నై : స్థానిక కోయంబేడు మార్కెట్‌లో టమోటాల విక్రయం బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం టమోటాల ధర కిలో సెంచరీ దాటిపోయింది. ఈ ధరాభారం నుంచి కొంతమేరకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి... రేషన్ షాపుల్లో కిలో టమోటాలను రూ.60కే విక్రయిస్తున్నారు. అయితే, టమోటాల ధర చాలా ఎక్కువగా ఉండటంతో గృహిణిలు కూడా కూరల్లో వాటిని తక్కువగా ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో కోయంబేడు మార్కెట్‌లో టమోటాలను కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా తగ్గింది. ఒక వేళ కొనుగోలు చేసినా కేవలం 250 గ్రాములు లేదా 500 గ్రాములు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఎవరు కూడా కిలోల్లో కొనుగోలు చేయడం లేదు. దీంతో టమోటాల విక్రయం గణనీయం గా తగ్గిపోయింది. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో చిల్లరగా కిలో టమోటా రూ.110 చొప్పున విక్రస్తున్నారు.

# బిఆర్ఎస్ - బిజెపి 'చీకటి ఒప్పందం'



## చక్కబెట్టింది యువరాజేనా!?

## కేసీఆర్‌పై 'ట్రోల్స్' చేస్తున్న నెటిజన్లు!

హైదరాబాద్ : రాజకీయాల్లో చోటు చేసుకునే కీలక పరిణామాలు ఉత్తినే చోటు చేసుకోవు. అందునా.. అధికారం కోసం దేనికైనా రెఢీ అన్నట్లుగా వ్యవహరించే మోడీషాలు.. తెలంగాణలో తమకున్న సానుకూల వాతావరణాన్ని స్వయంగా పాడు చేసుకునే తెలివి తక్కువతనం వారికి ఉందా? అన్నదిప్పుడు చర్చగా మారింది. కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారిన తెలంగాణ బీజేపీ నాయకత్వ మార్పు.. అంచనాలకు తగ్గట్లే జరగటమే దీనికి కారణం. బండి స్పీడ్ ను తట్టుకోవటం కష్టమన్న ఉద్దేశంతో.. ఆయనకు బదులుగా నెమ్మదితనంతో ఉండే కిషన్ రెడ్డిని తీసుకొస్తే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ చేతికి మరోసారి అధికారాన్ని అప్పగించేందుకు వీలుగా మోడీషాలు సహకారాన్ని అందించాలంటూ గులాబీ బాస్ వేడుకున్నారా? ఈ సాయానికి బదులుగా.. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల సమయాన ఎంపీ సీట్లతో 'రుణం' తీర్చుకుంటామన్న ఒప్పందం కుదిరిందా? అన్నదిప్పుడు ప్రశ్న. ఎందుకంటే అటు బీజేపీకి కానీ బీఆర్ఎస్ కు కానీ ప్రత్యర్థి కాంగ్రెస్సే. బలహీనంగా ఉన్నంతవరకు ఓకే కానీ.. ఒక్కసారి పుంజుకొని.. తిరిగి అధికారాన్ని చేతిలోకి తీసుకుంటే మాత్రం కాంగ్రెస్ ను ఆపటం అంత తేలికైన విషయం కాదన్నది అటు మోడీషాలకు.. ఇటు కేసీఆర్ కు బాగానే తెలుసు. ఈ కారణంతోనే తెర వెనుక ఒప్పందంతో కాంగ్రెస్ ను దెబ్బ తీసే పక్కా ప్లాన్ ను సిద్ధం చేసుకున్నారని.. అందుకు తగ్గట్లే తాజాగా మార్పులు చేసి.. కిషన్ రెడ్డి చేతికి పగ్గాలు అప్పగించారన్న చర్చ హాట్ టాపిక్ గా మారింది. ఈ వాదనకు బలం చేకూరేలా ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల్ని ప్రస్తావిస్తున్నారు. నిత్యం మోడీషాలపై విరుచుకుపడే కేటీఆర్.. హటాత్తుగా ఆ మధ్యన ఢిల్లీకి వెళ్లటం తెలిసిందే. అమెరికా పర్యటనలో మోడీ బిజీగా ఉన్న వేళలో.. కేంద్రమంత్రుల్ని కలిసిన సందర్భంలోనే అమిత్ షాతో భేటీ కావటం.. 'రాష్ట్ర సమస్య'ల మీద చర్చలు జరిపి.. ఆ తర్వాత బయటకు వచ్చి విమర్శలు చేయటం ద్వారా సీన్ ను శాయశక్తులా పండించిన వైనం తెలిసిందే. కేటీఆర్ ఢిల్లీ టూర్ కు కొంతకాలం ముందు నుంచి బీజేపీ మీదా.. మోడీ సర్కారు మీద ఆన్ లైన్ లోనూ.. ఆఫ్ లైన్ లోనూ పంచ్ లు వేయటం తగ్గించేయటం తెలిసిందే. అంతేకాదు.. గులాబీ బాస్ సొంత మీడియాలోనూ ఈ మధ్యన కేంద్రానికి.. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని వైఫల్యాలకు సంబంధించిన స్టోరీలు రాకపోవటాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడు గురి మొత్తం కాంగ్రెస్.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల మీదనే ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ చెప్పిన మాటల్ని మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి చెప్పిన తర్వాత నుంచి సీన్ మొత్తం మారిపోయినట్లుగా చెబుతున్నారు. మొత్తంగా గులాబీ కారును ఢీ కొనే క్రమంలో 'బండి' రెండు చక్రాలు దారుణంగా దెబ్బ తిన్నాయన్నది తాజా పరిణామాల్ని చూసినోళ్లంతా కామెంట్లు చేయటం గమనార్హం. అయితే.. ఈ వాదనలో నిజం మాటేమిటి? అన్నది పెద్ద ప్రశ్న. ఒకవేళ ఇందులో నిజం లేకుంటే.. ఈ అనుమానం రానున్న రోజుల్లో గులాబీ బాస్ కు శాపంగా మారుతుందని చెప్పక తప్పదు.

## అమ్మో 8వ తేదీ.. కిషన్ రెడ్డిలో టెన్షన్

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ పగ్గాలు చేపట్టిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మరో 2 రోజుల్లో అతిపెద్ద పరీక్ష సిద్ధంగా ఉంది. బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డిని పార్టీ అధ్యక్షుడిగా నియమించి ఆయన పదవీ కాలంలో మరుక్షణం నుంచే మొదలువుతన్నట్లు పార్టీ ప్రకటించింది. అయితే.. జులై 8న వరంగల్లో మోదీ బహిరంగ సభ ఉండడంతో దాన్ని సక్సెస్ చేయడంలో కిషన్ రెడ్డి ఎంతవరకు సక్సెస్ అవుతారన్న ప్రశ్నలు బీజేపీలో వినిపిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్నప్పటికీ కిషన్ రెడ్డికి క్రౌడ్ పుల్లర్ అనే పేరు లేదు. మోదీ ఛరిష్మాతో జనం వస్తారు కానీ దానికి సమీకరణ కూడా కొంత తోడవ్వాలి. మరి కిషన్ రెడ్డి ఆ విషయంలో ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి. నిజానికి బండి సంజయ్ ఈ విషయంలో మంచి నేర్పరి. జనాన్ని పోగెయ్యడంలో తాను తోపు అని సంజయ్ చాలాసార్లు నిరూపించుకున్నారు. ఆయన పదవీ కాలంలో కేంద్రం నుంచి వచ్చిన నేతల సభలు ర్యాలీలకు జనం పోటెత్తేలా చేయగలిగారు. గత ఏడాది మోదీ సికింద్రాబాద్లో నిర్వహించిన సభ అయితే తెలంగాణ బీజేపీ చరిత్రలో చెప్పుకోదగ్గ సభల్లో ఒక్కటిగా నిలిచింది. వరంగల్ సభ కూడా ఆ స్థాయిలో ఉండాలని బీజేపీ అధినాయకత్వం కోరుకుంటోంది. కానీ... తాజాగా పార్టీలో చేసిన మార్పులు చేర్పులు కారణంగా ఏర్పడిన అసంతృప్తుల నేపథ్యంలో ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి. ఎలాంటి పదవి దక్కకపోవడంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు.. విజయశాంతి కూడా పార్టీ తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. మరోవైపు నిన్నటి వరకు అధ్యక్షుడిగా ఉన్న సంజయ్ కూడా ఆవేశంగానే మాట్లాడుతున్నారు. రఘునందన్ రావు సంగతైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇలాంటి పరిస్థితులలో.. తనను తెలంగాణ పార్టీకి అధ్యక్షుడిగా నియమించడం అందరికీ ఆమోదమేనని ప్రదర్శించుకోవడం నేతల్లో అసంతృప్తి కనిపించకుండా చేయడం మోదీ సభకు సక్సెస్ చేయడం వంటివన్నీ ఇప్పుడు కిషన్ రెడ్డికి పరీక్షే. ఈ విషయం ఆయనకు ఇప్పటికే అర్థం కావడంతో జిల్లాలలోని నాయకులందరికీ ఫోన్లు చేస్తూ జనసమీకరణ పనులు ప్రారంభించారు. అంతేకాదు.. ఏపీ నుంచి కూడా కొంతవరకు జనసమీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## కేసీయార్‌తో ఇబ్బందులు తప్పవా ?




నల్గొండ : రాబోయే ఎన్నికల్లో వామపక్షాల కు కేసీయార్ తో ఇబ్బందులు తప్పేట్లు లేదు. పొత్తులు సీట్ల షేరింగ్ విషయాలు మాట్లాడేందుకు వామపక్షాలు ఎంత ప్రయత్నిస్తున్నా ఉపయోగం కనబడటంలేదు. కొద్దిరోజులు గా వామపక్షాలు అపాయిట్మెంట్ కోసం ఎంత ఒత్తిడి తెస్తున్నా ఎలాంటి ఉపయోగం కనబడటంలేదు. ఇదే విషయమై సీపీఐ సీపీఎం కార్యదర్శులు కూనంనేని సాంబశివ రావు తమ్మినేని వీరభద్రంతో పాటు ముఖ్యనేతలు సమావేశమయ్యారు. రెండుపార్టీల మధ్య పరిస్థితులను కేసీయార్ వైఖరిని రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల పై సుదీర్ఘంగా చర్చించారు. అంతా అయినతర్వాత పొత్తులు సీట్లసర్దుబాటు విషయం లో తనంతట తానుగా కేసీయార్ పిలిస్తే తప్ప వెళ్ళకూడదని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతు తమ్మినేని తేల్చిచెప్పారు. కేసీయార్ పిలిస్తే తప్ప వెళ్ళకూడదని డిసైడ్ చేసినట్లు చెప్పారు. ఇక్కడ విషయం ఏమిటంటే ఖమ్మం నల్గొండ జిల్లాల్లో రెండుపార్టీలు 15 సీట్లు అడుగుతున్నాయి. ఎందుకంటే వామపక్షాల కు బలమున్న జిల్లాలు ఈ రెండే కాబట్టి. అయితే కేసీయార్ కు వామపక్షాల కు ఒక్కటంటే ఒక్కసీటు కూడా ఇచ్చే ఉద్దేశ్యంలో లేరట. అప్పట్లో అంటే మునుగోడు ఉపఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందికాబట్టి వామపక్షాల తో పొత్తులు పెట్టుకుంటామని కేసీయార్ హామీ ఇచ్చేశారు. ఆ హామీ ప్రకారమే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కు వామపక్షాలు బాగా కష్టపడ్డాయి. అవసరం తీరిపోయిన తర్వాత కేసీయార్ ఇపుడు వామపక్షాల వైపు చూడటంలేదు. దీనికితోడు పార్టీలో కూడా ఇబ్బందులు మొదలైపోయాయి.

కర్నాటక లో కాంగ్రెస్ ఘనవిజయం తర్వాత తెలంగాణా లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కాంగ్రెస్ పార్టీలో గెలుపు జోష్ ఒక్కసారిగా పెరిగిపోయింది. బీఆర్ఎస్ బీజేపీల నుండి నేతలు కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుండి ఇంకెంతమంది నేతలు కాంగ్రెస్ లో చేరుతారో తెలీటంలేదు. అందుకనే సిట్టింగ్ ఎంఎల్ఏలు సీనియర్ నేతల్లో ఎవరినీ వదులుకునే పరిస్థితి కేసీయార్ కు లేదు. ఈ సమయం లోనే వామపక్షాలు అడుగుతున్నట్లు పొత్తులు పెట్టుకుని కొన్ని సీట్లు వదులుకోవాలంటే కేసీయార్ కు ఇబ్బందిగా మారింది. అందుకనే పొత్తుల విషయాన్ని ఇపుడు చర్చించే పరిస్థితి కేసీయార్లో లేదుకాబట్టే అవాయిట్ చేస్తున్నారు. చివర కు ఏమవుతుందో చూడాల్సిందే.




## అంతర్గత పోరులో...

# నిలబడ్డ రేవంత్ రెడ్డి చతికిలబడ్డ బండి!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో ఊహించని పరిణామాలు జరిగాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఇద్దరు రాష్ట్ర రాజకీయాలను మార్చాలని బరిలోకి దిగి దూకుడుగా పనిచేశారు. ఇద్దరు దూకుడుగా పాదయాత్రలు చేసి, అనేక చోట్ల బహిరంగ సభలు నిర్వహించి ప్రజల మద్దతును పొందే ప్రయత్నం చేశారు. తెలంగాణలో ఎన్నికలను టార్గెట్ చేసుకొని ఇద్దరూ బరిలోకి దిగినా ఊహించని విధంగా బండి సంజయ్ అవుటయ్యారు.

ఆదినుంచి సీనియర్ నాయకుల తీవ్ర వ్యతిరేకత మధ్య రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కాంగ్రెస్ పార్టీలో అడుగడుగునా సీనియర్లు ఆయనకు సహకరించకపోయినా, అధిష్టానానికి ఫిర్యాదు చేసినా, రేవంత్ రెడ్డితో కలిసి పనిచెయ్యం అని తేల్చి చెప్పినా, రేవంత్ రెడ్డిని వ్యతిరేకిస్తున్న కొందరు నాయకులు పార్టీని వీడి వెళ్ళినా సరే రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించి ముందుకు సాగారు. అనేకసార్లు కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలు, రేవంత్ రెడ్డి పై వచ్చిన ఆరోపణలు, బాహాటంగా సీనియర్ నాయకులు చేసిన విమర్శలు రేవంత్ రెడ్డిని అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తారు అన్న చర్చకు కారణమైనా అధిష్టానం రేవంత్ రెడ్డి పై పూర్తి విశ్వాసంతో ఆయననే తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగించింది. తెలంగాణలో రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో యాత్రలోనూ రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించిన కొందరు ఆ కార్యక్రమానికి హాజరు కాబోమని అల్టిమేటం జారీ చేసినా సరే రేవంత్ రెడ్డి పై కాంగ్రెస్ అధిష్టానం పూర్తి విశ్వాసాన్ని ఉంచింది.

ఫలితంగా ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో పలువురు ముఖ్య నాయకుల చేరికతో కాంగ్రెస్ పార్టీ నిలదొక్కుకుంది. అంతర్గతంగా ఎన్ని కలహాలు ఉన్నా ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రస్తుతం అంగీకరించ వలసిన పరిస్థితి వచ్చింది. రేవంత్ రెడ్డిని ఊపేసిన వ్యతిరేకత ఆయనను మాత్రం అధ్యక్ష పదవి నుండి కదిలించలేక పోయింది. ఇదిలా ఉంటే తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఏకతాటి మీద నడిపిస్తాడు అని భావిస్తే, మొదట్లో బాగానే ఉన్నా తర్వాత క్రమంలో మొదలైన అంతర్గతపోరు అధ్యక్షుడిగా తొలగించేలా చేసింది. బండి సంజయ్ ఒంటెత్తు పోకడలను, అంతర్గత కలహాలను సీరియస్ గా తీసుకున్న బిజెపి అధినాయకత్వం అధ్యక్షుడిగా ఆయనను పక్కనపెట్టి కిషన్ రెడ్డికి పట్టం కట్టింది.

ఇక అధ్యక్ష స్థానం నుంచి తొలగిస్తారు అనుకున్న రేవంత్ రెడ్డి నిలదొక్కుకుంటే, వచ్చే ఎన్నికలకు రథసారధిగా వ్యవహరిస్తారు అనుకున్న బండి సంజయ్ అంతర్గత పోరు లో చతికిల పడ్డారు.

# సంపాదకీయం

## చీల్చి చెండాడుతున్న బీజేపీ...

### ఎన్సీపీ తరువాత ఆ పార్టీయేనా...?

దేశంలో కొత్త రాజకీయానికి బీజేపీ నాంది పలుకుతోంది. ఇప్పటిదాకా ఎన్నికల రాజకీయాలనే అంతా చూశారు. అయితే బీజేపీ మాత్రం ఎన్నికలు జరిగి పూర్తి మెజారిటీ దక్కిన పార్టీలను సైతం అధికారంలో ఉండనీయకుండా ఎత్తులు పై ఎత్తులు వేసి చిత్తు చేసిన ఘటనలు చూశారంతా. మధ్యప్రదేశ్ లో కర్నాటకలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను అలాగే బీజేపీ కూలదోసింది అన్న పేరు తెచ్చుకుంది. ఇక రాజస్థాన్ విషయంలోనూ తుదికంటా ప్రయత్నం చేసినా ఫలితం అయితే దక్కలేదు. ఇపుడు ప్రాంతీయ పార్టీలను వరసబెట్టి పని పట్టేందుకు బీజేపీ కొత్త ప్లాన్ తో రంగంలోకి దిగుతోంది. ముందుగా ఎన్సీపీకే గురి పెట్టింది. 2019 ఎన్నికల్లో మహారాష్ట్రంలో బీజేపీకి అతి పెద్ద పార్టీగా సీట్లు వచ్చినా అధికారం మాత్రం దక్కలేదు. అయితే ఎన్సీపీ ని చీల్చి శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ ని తెచ్చి డిప్యూటీ సీఎం ఇచ్చి మరీ సర్కార్ ని ఏర్పాటు చేసింది. అయితే శరద్ పవార్ మేలుకుని మొత్తానికి సర్దుకున్న తరువాత బీజేపీ పాలిటిక్స్ కి చెక్ పడింది. ఆ తరువాత శివసేన ఎన్సీపీ కాంగ్రెస్ కలసి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా రెండేళ్ళ తరువాత దాన్ని కూల్చడంలో బీజేపీ కీలకమైన పాత్ర పోషించింది అని అంటారు. ఇక గత ఏడాది సరిగ్గా జూలై నెలలోనే శివసేనను చీల్చి ఏక్ నాథ్ షిండేను తెచ్చి మరీ నలభై మంది శివసేన ఎమ్మెల్యేలను కలుపుకుని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే బీజేపీ ముఖ్యమంత్రి పోస్ట్ తీసుకోకుండా షిండేకే పీఠం అప్పగించి తెలివిడిని ప్రదర్శించింది. ఇపుడు బీజేపీ చూపు ఎన్సీపీ మీద పడింది. నిజానికి సీనియర్ మోస్ట్ లీడర్ ఎనిమిది పదులు దాటిన శరద్ పవార్ ని మోడీ గౌరవిస్తారు. కానీ బీజేపీ ఎత్తుగడల్లో భాగంగా ఏకంగా ఎన్సీపీనే చీల్చారు. ఇది ఆ పార్టీ సైతం ఊహించని పరిణామంగా ఉంది. ఈ మొత్తం ఆపరేషన్ ని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రెండవ కంటికి తెలియకుండా చేపట్టారు. అజిత్ పవార్ ప్రమాణం స్వీకారం చేశేవరకూఎవరకూ పెదాయన శరద్ పవార్ కి కూడా తెలియదు అని అంటున్నారు. ఇలా ఏడాది వ్యవధిలో రెండు కీలకమైన ప్రాంతీయ పార్టీలను చీల్చేసిన బీజేపీ చూపు ఇపుడు ఎవరి మీద ఉంది అన్నదే చర్చకు వస్తోంది. బీజేపీ ఈసారి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని టార్గెట్ చేస్తుందా లేక ఢిల్లీ సీఎం కేజ్రీ వాల్ మీద చూపు సారిస్తుందా అన్నదే రాజకీయ వర్గాలలో బిగ్ డిబేట్ గా ఉంది. మమతా బెనర్జీని కూడా ఏ మాత్రం చాన్స్ వచ్చినా వదలకూడదని బీజేపీ భావిస్తోందిట. అంతే కాదు తమకు తలనొప్పిగా ఉన్న ఏ ప్రాంతీయ పార్టీని బీజేపీ స్పేర్ చేయదని అంటున్నారు. బీజేపీ రాజకీయ నీతి మీద శివసేన ఎన్సీపీలు నిప్పులు చెరుగుతున్నాయి. ఈ రకమైన వ్యవహార శైలి రాజకీయాల్లో మంచిది కాదని అంటున్నాయి. శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అయితే బీజేపీ ఈ రకంగా రాజకీయ మాయాజాలం చేసినా 2024 ఎన్నికల్లో తమ పార్టీ మహారాష్ట్రలఒ గెలుస్తుందని అలాగే ఎన్సీపీ కాంగ్రెస్ లతో కూడిన కూటమిదే ఎప్పటికైనా విజయం అని అంటున్నారు. దేశంలో జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలు మోడీకి యాంటీగా కూటమి కడుతున్న వేళ బీజేపీ ప్లాన్ బీ అంటూ ప్రాంతీయ పార్టీలను చీల్చే పనిలో ఉందని అంటున్నారు. అది బీహార్లో నితీష్ కుమార్ జేడీయూకి కూడా సెగ తగిలినా తగలవచ్చు అంటున్నారు. ఇక సౌత్ విషయానికి వస్తే ఈ టెర్మ్ కి కాదు కానీ 2024 తరువాతనే బీజేపీ అసలైన రాజకీయం చూపిస్తుంది అంటున్నారు.

# మిరప రైతుకు కష్టాల ఘాటు

నల్గొండ : ఉమ్మడి జిల్లా రైతులు పండించే ప్రధాన వాణిజ్య పంటల్లో మిరప ఒకటి. అదృష్టం ఉంటే రైతు ఇంట ఇది ఎర్ర బంగారమే. ప్రతికూలమైతే ఇల్లు గుల్లే. ఈ సీజన్ ఆరంభమే మిరప రైతుకు కలిసిరాలేదు. ఆదిలోనే చేదు అనుభవాన్ని రుచిచూపింది. ప్రతికూల వాతావరణంతో రెండుసార్లు పోసిన నారు ఊపిరి నిలవలేదు. ఎకరానికి రూ.20 వేలు బూడిదలో పోసిన పన్నీరైంది. ఆదిలోనే ఆర్థికంగా కుంగదీసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 70 శాతం రైతులది ఇదే పరిస్థితి. 10 వేల ఎకరాల్లో ఎకరాకు రూ. 20 వేల చొప్పున నష్టం జరిగినట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఆదుకుంటుందనుకున్న ఫసల్ బీమా యోజన పథకం బాధిత రైతులకు దూరమైంది. రైతుల్ని అయోమయంలో పడేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల్లో ఏటా మిరప సాగు చేస్తారు. ఈ సీజన్‌లోనూ అదే స్థాయిలో వేసేందుకు రైతులు ప్రయత్నించారు. కానీ.. ప్రతికూల వాతావరణం వెంటాడి నష్టం మిగిల్చింది. నారు ఎండిన స్థానంలో మళ్లీ ఇప్పుడు మిరప మొక్కలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలోనే మిరప మొక్కలు నాటుకున్నాయి. అదికూడా సూర్యాపేట జిల్లాలోనే గరిష్టంగా వేశారు. ఈ ప్రాథమిక దశకే ఎకరానికి రూ.25 వేల వరకు వెచ్చించాల్సి వచ్చింది. సాధారణంగా ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడిగా వెచ్చిస్తుంటారు. 15-30 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తుంటాయి. దిగుబడుల సంగతి దేవుడెరుగు ఈ ఖర్చు ఈసారి మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ దశలోనైనా ప్రతికూల వాతావరణ ప్రభావం తమ ఆర్థిక స్థితిని దెబ్బతీయకుండా బీమా పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

భయం భయంగానే సాగు: కృష్ణయ్య, రైతు, మేళ్లచెరువు

నేను రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్న. ముప్పావు ఎకరంలో మిరప మొక్కలు భయం భయంగానే నాటా. జులైలో మిరప నారు సాళ్లలో పోశా. అప్పుడు అరక, విత్తనాలకు రూ.12 వేలు ఖర్చయింది. మొక్కలు కొంచెం పెరగ్గానే ఎండల ఉక్కకు ఎండిపోయింది. మళ్లీ మొక్క రూ.1.25 చొప్పున కొనుక్కొచ్చా. 16 వేల మొక్కలేశా. ఊపిరి పోసుకున్నా మళ్లీ భయంగానే ఉంది. వాతావరణం అనుకూలించకపోతే మళ్లీ రూ.20 వేలు పోయినట్టే.

బీమా పరిహారం ఇవ్వటం లేదు: జిల్లా ఉద్యాన అధికారులు

ఈ సీజన్‌లో మిరప సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారు. కానీ.. వాతావరణం అనుకూలించలేదు. రెండుసార్లు నారు పాడైంది. రైతులకు నష్టం వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఫసల్ బీమా పథకం రైతులకు ఉపశమనం కలిగించేది. ఈ పథకాన్ని రెండేళ్ల కిందటే ప్రభుత్వం ఎత్తేసింది. ఈ స్థితిలో బీమా పరిహారం అందే అవకాశం లేదు.

రూ.50 వేలు వృథా: నాగిరెడ్డి, రైతు, మేళ్లచెరువునేను రెండెకరాల్లో మిరప విత్తనాలు ఎదపోశా. రూ.20 వేలు విత్తనాలకే ఖర్చొచ్చింది. అరక, మందులు జులై, ఆగస్టులో రెండుసార్లు కలిపి మరోరూ.25 వేలు వెచ్చించా. మొదట జులైలో మొలిచి ఎండల ఉబ్బకు మొక్కలు చనిపోయాయి. ఇటీవల 15 రోజుల ముసురు దెబ్బకు రెండోసారి నాటుకోసం పోసిన నారు కుళ్లిపోయింది. దీంతో మరింత నష్టం వాటిల్లింది. ఫసల్ బీమా యోజన పథకం ఉంటే పరిహారం అందేది. ఇప్పుడు లేదంట. దాదాపు రూ.50 వేలు వృథా అయినట్టే. కాలం ఆలస్యమైనందున ఇప్పుడు నారు కష్టం. ఎకరానికి 16వేలు మొక్కలే నాటాలి. అనుకూలించకుంటే ఈసారి కోలుకోవడం కష్టమే.

# గాల్లో దీపాలు.. కార్మికుల ప్రాణాలు!

చిట్యాల : రసాయన పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కొరవడుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో గత దశాబ్ద కాలం నుంచి బుధవారం సాయంత్రం చిట్యాల మండలం వెలిమినేడులోని హిండిస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం వరకు పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. ఇప్పటివరకు జరిగిన పలు ప్రమాదాల్లో మానవ తప్పిదాలు, సాంకేతిక లోపాలే కారణమై ఉంటున్నాయి. రియాక్టర్ల వద్ద ఉష్ణోగ్రత, ఒత్తిడి పెరగకుండా చూసుకోవాలి. ఇవి పెరిగితే స్థిర విద్యుదీకరణ, ప్రతి చర్య జరిగి మంటలు వ్యాపించే అవకాశం ఉంటుంది. అదృష్టవశాత్తు హిండిస్ ల్యాబ్‌లోని బ్లాక్-డీలో జరిగిన ప్రమాదంలో 32 రియాక్టర్లు ఉన్నా.. ఏ ఒక్కటి పేలకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సాల్వెంట్‌ను ఫిల్టర్ చేసి ముడి రసాయన పదార్థాన్ని బయటికి తీసే క్రమంలో ఏఎన్ఎఫ్‌డీ పేలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రమాదం అనంతరం మిగతా రియాక్టర్లకు మంటలు అంటుకుంటే పరిస్థితి మరోలా ఉండేదని, అదృష్టవశాత్తు అతిపెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు చెబుతున్నారు. గురువారం ప్రమాద జరిగిన తీరును డైరక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్ రావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శశికుమార్, పీసీబీ ఈఈ సురేశ్ పరిశీలించారు. సాంకేతిక లోపంతోనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు.

అవగాహన లేకపోవడంతోనే..

రసాయన పరిశ్రమల్లో ప్రమాదం జరిగిన తర్వాత ఆపదం ఎవరి



తరం కాదు. కాకపోతే ప్రమాదం జరగకముందే తీసుకోవల్సిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలి. అంటే ఎంతో ప్రావీణ్యం కలిగిన కార్మికులను నియమించుకోవాలి. కానీ చాలా పరిశ్రమలు తక్కువ వేతనానికి వచ్చే అవగాహన లేని కార్మికులను నియమించుకుంటున్నాయి. ఇది కూడా ఒక రకంగా ప్రమాదానికి కారణమవుతోందని ఓ పారిశ్రామిక నిపుణుడు అభిప్రాయపడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు అమాయకులైన కార్మికులు ప్రాణాలతో పోరాడాల్సి వస్తోంది.

ఇలా చేస్తే మేలు..

లి రసాయన పరిశ్రమల్లో భద్రతా చర్యలను తప్పకుండా చేపట్టేలా పరిశ్రమల శాఖ, ప్రమాదం జరిగిన తర్వాత అదుపులోకి తెచ్చే పరికరాలు అన్ని ఉండేలా అగ్నిమాపకశాఖ అధికారులు తరుచు తనిఖీలు చేస్తూ కఠినంగా వ్యవహరించాలి. లి పరిశ్రమలు అనుమతులు తీసుకున్న విధంగానే ఉత్పత్తులు చేస్తున్నాయా లేదా అని కాలుష్య నియంత్రణ మండలి, డ్రగ్ కంట్రోల్ అధికారులు నిఘా పెట్టాలి. పరిశ్రమల్లో ఆకస్మిక తనిఖీలను చేపట్టడం వల్ల నిబంధనలను పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవచ్చు.

లి రసాయనాల ఉత్పత్తులపై కార్మికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. నైపుణ్యం గల కార్మికులే పని చేసేలా అధికారుల పర్యవేక్షణ చేయాలి. ఇలా చేయడం వల్ల ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయవచ్చు.

# యువతా..జర జాగ్రత్త!

కొత్తగూడెం : 'వేగం పనికి రానిది.. ప్రాణం తిరిగి రానిది..' అని రవాణా, పోలీసు అధికారులు రోడ్డు భద్రతా వారోత్సవాలు, వివిధ సందర్భాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నా పెద్దగా మార్పు కనిపించడం లేదు. ముఖ్యంగా అతి వేగం యువకులను ప్రాణాపాయంలోకి నెట్టేస్తోంది. నిత్యం ఎక్కడో ఒకచోట బాధిత కుటుంబం శోకసంద్రంలో మునుగుతోంది. వాహనాలు నడిపే వారిలో 45 శాతం వరకు డ్రైవింగ్ లైసెన్సులు లేనివారేనని గణంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఇది 58 శాతానిపైగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు సంభవించిన ప్రమాదాల్లో మృతులు, క్షతగాత్రుల్లో యువతే ఎక్కువగా ఉండటం బాధాకరం. తల్లిదండ్రులూ పారాహుషార్!.

నిర్లక్ష్యం తగదు

నిత్యం జరుగుతున్న ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యంగా వాహానాలను నడపడమేనని ట్రాఫిక్ అధికారులు అంటున్నారు. 25 శాతం మంది మాత్రమే నిబంధనలు పాటిస్తున్నారు. సమయం మించిపోతుందనో.. ఆలస్యమవుతుందేమోనని మిగిలిన వారు ఏదో ఒక సమయంలో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతూనే ఉన్నారు. ఖమ్మం నగరం, గ్రామీణం, మధిర, సత్తుపల్లి గ్రామీణం, పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం సర్కిళ్ల పరిధిలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో 30 శాతం ప్రమాదాలు 25 ఏళ్ల లోపు విద్యార్థుల వల్లేనని పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పట్టణ శివారుల్లోని ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కొత్తబైక్‌లు, ఖరీదైన వాహనాలను కొంటున్నారు. డ్రైవింగ్‌లో తగినంత నైపుణ్యం లేక కొందరు, అతివేగంతో మరికొందరు దూసుకెళ్లి ప్రమాదాల వలలో చిక్కుకుంటున్నారు. మొత్తం ప్రమాదాల్లో 60 శాతం ద్విచక్రవాహన చోదకుల కారణంగా సంభవిస్తుండటం గమనార్హం. ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు, ఇతర శాఖల అధికారులు కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నా పెద్దగా మార్పు కనిపించడం లేదన్న వాదన వినిపిస్తోంది.

మైనర్లదీ అదే దారి

ద్విచక్రవాహనాలు, కార్లను నడుపుతున్న ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థుల్లో 40 శాతం మంది వారాంతాల్లో విందులు, వినోదాల్లో పాల్గొంటున్నారు. ఆ సమయాల్లో మద్యం వాడుతున్నారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలను నడుపుకొంటూ ఇళ్లకు వెళ్తున్నారు. పోలీసుల డ్రంకెన్ డ్రైవ్‌లో ఏటా వందల సంఖ్యలో యువకులు పట్టుబడుతున్నారు. ఇందులో మైనర్లు కూడా ఉన్నారు. రెండేళ్ల నుంచి వీరి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2019లో 317, 2020లో 598, 2021లో 684 మంది తనిఖీల్లో దొరికిపోయారు. వీరిలో 17 ఏళ్ల నుంచి 20 ఏళ్ల లోపు ఉన్న యువకులు 11 శాతం మంది ఉన్నారు. పోలీసులకు పట్టుబడుతున్న యువకుల్లో 99 శాతం మందికి మద్యంతాగి వాహనం నడపడం తప్పు అని తెలుసు. తెలిసినా సరే.. మోతాదుకు మించి తాగుతున్నారు.

యువ వేగానికి.. మత్తు తోడు

మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరం. న్యాయస్థానాలు సైతం కఠిన శిక్షలు వేస్తూ తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ ఇచ్చేలా ఆదేశాలిస్తున్నాయి. పోలీసులు సైతం తనిఖీలను కట్టుదిట్టం చేయడంతో ఇప్పుడిప్పుడే పౌరుల్లో కొంత అవగాహన వస్తోంది. అయితే ఆశించినంత మార్పు మాత్రం కనిపించడం లేదు. మద్యం కారణంగా ప్రమాదాలు అధికంగా జరిగే జిల్లాల్లో గతేడాది ఉమ్మడి ఖమ్మం 9వ స్థానంలో నిలిచింది. 2021లో జరిగిన మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 42.8% మద్యం కారణంగా జరిగినవే కావడం గమనార్హం. అందునా.. మొత్తం క్షతగాత్రులు, మృతుల్లో 37.38% మంది బాధితులు 18-35 మధ్య వయస్కులున్నారు.

పిల్లల్ని కట్టడి చేయాలి..- డా.వినీత్, ఎస్పీ, భద్రాద్రి

రహదారి ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధికులు ద్విచక్రవాహనదారులే. వారిలో యువత ఎక్కువశాతం ఉండడం కలచివేస్తోంది. శిరస్త్రాణం ధరించాలని చెబుతున్నా కొందరు మారడం లేదు. కొందరు పది పాస్ కాగానే తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి స్పోర్ట్స్ బైక్‌లు కొంటున్నారు. వారి బరువు కంటే ఆ వాహనాల బరువు రెండింతలు ఉంటోంది. వేగంలో అదుపుచేయలేక ప్రమాదం పాలవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు, యువతకు వాహనాలను కొనివ్వడం కాదు.. ఆ తర్వాత వారు జాగ్రత్తగా నడిపేలా చూడటం ముఖ్యం. పల్లెల్లోనూ పిల్లలు బైకు లేనిదే బయటకు వెళ్లరన్న వాతావరణాన్ని అలవాటు చేశాం. ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఎంటెక్ చదువుతున్న వారిలో కొందరు స్థోమతను బట్టి బైకులు, కార్లు నడుపుతున్నారు. కొందరు స్వేచ్ఛగా బయటకు వెళ్లి పార్టీల పేరుతో మద్యపానం చేస్తున్నారు. ఇంతవరకు రాకుండా ప్రాథమిక దశలోనే పిల్లల్ని నియంత్రించడానికి వెనుకాడొద్దు.

# పాఠశాలల్లో పత్తాలేని పారిశుద్ధ్యం

సత్తుపల్లి : వ్యాధులు ముసురుకుంటున్నాయి.. బడుల్లో విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత అత్యవసరం. బడులు స్వచ్ఛంగా లేకపోతే విద్యార్థుల పరిస్థితి ఇట్లే అర్థమవుతోంది. ఉభయ జిల్లాల్లోని ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో అపరిశుభ్రత నిలయాలుగా మారాయి. స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులే ఆ పనులు చేసుకుంటున్నారు. కొందరు ఆవరణం వరకు ఊడ్చేందుకు మనషులను పురమాయించుకుని మమ అనిపిస్తున్నారు.

స్కావెంజర్స్ వ్యవస్థ రద్దు..

2015లో పాఠశాలకు ఒకరి చొప్పున ఉన్నత పాఠశాలల్లో అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి ఇద్దరు చొప్పున స్కావెంజర్లను ఏర్పాటుచేశారు. వీరికి తరగతి గదులు, వరండాలు, ప్రాంగణం, మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వేతనం అందించారు. కరోనా నేపథ్యంలో పాఠశాలలు మూతపడటంతో అప్పటి నుంచి కార్మికులను (స్కావెంజర్స్) విధుల్లోకి తీసుకోలేదు. గతేడాది ఏడు నెలలు, ప్రస్తుతం జూన్‌లో పాఠశాలలు ప్రారంభమైనా ఇంతవరకూ స్వచ్ఛతపై చర్యలు లేవు. ః వైరా మున్సిపాల్టీ పరిధిలోని దుద్దెపూడి, శాంతినగర్, పల్లిపాడు, లాలాపురం పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. కార్మికులు అప్పుడప్పుడు వస్తుండటంతో స్వచ్ఛత లేక ఇబ్బందులు పడుతున్నారు.

లి సత్తుపల్లి పురపాలకం పరిధిలోని 15 పాఠశాలల్లో సుమారు 350 మంది ఉన్నారు. ఈ బడుల్లో కార్మికులు సక్రమంగా రాక స్వచ్ఛత అంతంతా మాత్రంగానే ఉంది.

లి కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు పరిధిలోని పాఠశాలల్లో కూడా విద్యార్థులే గదులు ఊడ్చుకోవడం, మధ్యాహ్న భోజనం అనంతరం పరిశుభ్ర పనులు చేసుకుంటున్నారు.

లి ఆంగ్ల మాధ్యమం, కరోనా పరిస్థితులతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. దానికి అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నవాటిని శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో బాలికలు



అనారోగ్యానికి గురవుతున్నారు.

పంచాయతీలకు అప్పగించినా

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పారిశుద్ధ్య బాధ్యతలను గ్రామ పంచాయతీలు, పురపాలికలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా పంచాయతీల్లో కార్మికులు ముగ్గురు నుంచి పదిమంది వరకు ఉన్నారు. వారంతా ఉదయం గ్రామంలో పనులు చేసి మళ్లీ పాఠశాలలో చేయటం ఇబ్బందిగా మారింది. ఫలితంగా స్కూళ్లలో మరుగుదొడ్లు మూతపడ్డాయి. పిల్లలే శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి. మరోవైపు మధ్యాహ్నం భోజనం చేసిన తరవాత విద్యార్థులే వరండాలను ఊడ్చుకుంటున్నారు. పురపాలిక విలీనమైన గ్రామాల్లో అయితే అసలు కార్మికులు రావడం లేదని ఉపాధ్యాయులు, స్థానికులు వాపోతున్నారు.

# నిలిచిన రహదారి విస్తరణ

భువనగిరి : భువనగిరి పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు వారం నుంచి నిలిచిపోయాయి. సమీకృత మార్కెట్ నుంచి పాత బస్టాండ్ వరకు రూ.15.18 కోట్లతో 2.15 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరిస్తున్నారు. గతేడాది దీపావళి రోజు పనులు మొదలుకాగా.. డిసెంబర్ 2022 వరకు పూర్తి చేయాల్సి ఉంది. నెలల తరబడి విస్తరణ, నిర్మాణాలు కొనసాగుతుండటంలో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదబాట నిర్మించే ప్రాంతాల్లో ప్రస్తుతం మట్టి తోలుతున్నారు. ఈ పనులు కొంత ఆలస్యమవుతున్నాయి. పాదబాట, పార్కింగ్ నిర్మాణాల మధ్య మొక్కలు నాటేందుకు కాల్వ వదిలి పనులు చేపట్టడం లేదు. దీంతో తాత్కాలిక బాటలు ఏర్పాటు చేసుకొని వ్యాపారులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మొక్కలు నాటే చోట వ్యర్థాలను వదిలేస్తున్నారు. ప్రధాన పనులను ఇంకా చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు రోడ్డుకు ఇరువైపులా వరద కాల్వ, పైప్‌లైన్ల నిర్మాణం, పార్కింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రతిపాదిత పనుల్లో 90 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా అసంపూర్తి చిన్న చిన్న పనులు సాగుతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

లోపించిన సమన్వయం

పలు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపించటంతో రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత విద్యుత్తు స్తంభాలు, తీగలు జరపకుండానే పార్కింగ్ సీసీ బెడ్‌ను నిర్మించారు. దీంతో పార్కింగ్ స్థలం మధ్య విద్యుత్తు స్తంభాలుండటంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు లైన్లు తొలగించేందుకు రూ.కోటి మంజూరు చేయాలని ఆ శాఖ చేసిన ప్రతిపాదనలకు ఇంకా మోక్షం దక్కలేదు. పాదబాట, సీసీ పార్కింగ్ మధ్య మొక్కలు నాటాల్సి ఉంది. సుందరీకరణ కోసం పూల మొక్కలు నాటాల్సి ఉండగా, పెద్ద చెట్లను అధికారులు తెప్పించడం విమర్శలకు తావిస్తోంది. పెద్ద చెట్లు నాటితే తమ వ్యాపారాలు దెబ్బతినే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారుల సూచనలు తీసుకోకుండానే చెట్లను తెప్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వానలు పడుతున్నందున వర్షాకాలం పోయాక బీటీ రోడ్డు నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇటు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించకపోవడం, అటు ప్రమాదకర గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

90 శాతం పనులు పూర్తి -ప్రసాద్, ఏఈ

ఇప్పటివరకు రూ.10 కోట్లు ఖర్చు పెట్టి 90 శాతం రహదారి విస్తరణ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం నల్లాల పైపులైన్, వాల్వ్, మట్టి పనులు కొనసాగుతున్నాయి. పాదబాట నిర్మించాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నందున బీటీ రోడ్డు నిర్మించలేం. గడువులోపు నిర్మాణాలు పూర్తి చేస్తాం.

# ఆర్థిక చేయూతకు చేతివాటం

సిరిసిల్ల: నగరంలోని ఓ ప్రాంతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రూ.లక్ష రుణానికి దరఖాస్తు చేసుకోగా ఇటీవల ఒక బిల్ కలెక్టర్ విచారణకు వెళ్లారు. ఆ సమయంలో వివరాలన్నీ నమోదు చేసుకొని రూ.5 వేలు ఇవ్వాలని కోరడంతో రూ.3 వేలు చేతిలో పెట్టారు. రుణం మాత్రం గ్యారెంటీగా వస్తుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరో ప్రాంతంలో ఓ డివిజన్ స్థాయి నాయకుడు చెప్పిన పేర్లకు కచ్చితంగా రుణం వచ్చేలా విచారణలో రాయాలని ఒత్తిడి తెచ్చారు. తీరా ఆరా తీస్తే అందినంత వసూలు చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది.రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల వృత్తిదారులకు ఆర్థికంగా చేయూత ఇవ్వడానికి వెనుకబడిన వర్గాల్లోని 14 కుల వృత్తిదారులతోపాటు ఎంబీసీలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి రూ.లక్ష రుణం అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో కుల ధ్రువీకరణతోపాటు ఆదాయ పత్రాలు జత చేశారు. ఈ గడువు జూన్ 20తో ముగియగా ఐదారు రోజులుగా క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభమైంది. అర్హులను నిర్ధారించి పంపించాల్సి ఉండటంతో పైరవీల జాతర మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 19,905 మంది దరఖాస్తు చేసుకున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు నాలుగు పురపాలికల పరిధిలో 4,516 మంది ఉన్నారు.

ముట్టజెబితేనే విచారణ

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో అత్యధికంగా రూ.లక్ష రుణానికి దరఖాస్తులు వచ్చాయి. 60 డివిజన్లకు కలిపి మూడు వేల మందికిపైగా



దరఖాస్తు చేసుకోగా వీటిని బిల్ కలెక్టర్ల ద్వారా విచారణ ప్రారంభించారు. సందట్లో సడేమియా అన్నట్లుగా కొందరు కార్పొరేటర్ల అనుచరులు, పైరవీకారులు, కొందరు బిల్ కలెక్టర్లు చేతి వాటానికి తెరలేపారు. బిల్ కలెక్టర్ల దగ్గర ఉన్న జాబితాల్లోని పేర్ల ఆధారంగా విచారణ చేస్తుండగా ఆ సమయంలో దరఖాస్తుదారుడి స్తోమతను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లకు తెరలేపారు. రూ.లక్షకు ఐదు శాతం ఇవ్వాలని, రుణం పక్కాగా వస్తుందని చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. కొందరు వార్డు, డివిజన్ స్థాయి నాయకులు కూడా బిల్ కలెక్టర్లపై ఒత్తిడి తెస్తూ విచారణలో అనుకూలంగా రాయాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

చరవాణులతోనే వివరాలు

బీసీ రుణాల కోసం విచారణ చేస్తుండగా దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి ఆర్థిక స్థితిగతులు పూర్తి స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. కొందరు బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లకుండా చరవాణులతో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. రాత్రి 8.30 గంటల వరకు ఫోన్లు చేస్తూ వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు దరఖాస్తుదారులే చెబుతున్నారు. స్థానికంగా లేకపోతే ముప్పుతిప్పలు పెడుతున్నట్లు విమర్శలున్నాయి.

బిల్ కలెక్టర్లతో కాకుండా..

అర్హులకు లబ్ధి చేకూరాలంటే వచ్చిన దరఖాస్తులను బల్దియా బిల్ కలెక్టర్లతోనే కాకుండా ఇతర శాఖల ఉద్యోగుల ద్వారా విచారణ జరిపితే మేలు జరిగే అవకాశముంది. వీరికి ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు పరిచయం ఉండదు. వెంటనే విచారణ పూర్తి చేసే అవకాశముంటుంది. ఉన్నది ఉన్నట్టుగా విచారణ చేపట్టిన సదరు మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ఉనికిపై ప్రమాదం ఏర్పడుతుందనే అభిప్రాయముంది. కొన్ని డివిజన్లలో ఇబ్బందులు కూడా తప్పడం లేదు. ఇతర విభాగాల సిబ్బందితో విచారణ చేయిస్తే వీధుల్లో రాజకీయంగా ఒత్తిడి తగ్గుతుందని అంటున్నారు. సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లగా బిల్ కలెక్టర్లు ఎలాంటి డబ్బులు అడగడంలేదని, ఇప్పటివరకు ఫిర్యాదులు కూడా తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

## ఇక పక్కాగా రేషన్ బియ్యం లెక్క!

హుజూరాబాద్: ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ప్రజా పంపిణీలో అమలు చేసే సాంకేతికతను ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ఈ నెల నుంచే రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గిడ్డంగులకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

తీరనున్న తరుగు కష్టాలు ఉమ్మడి జిల్లాలోని 14 ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి 1,964 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతుంది. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. తమ దుకాణాలకు వచ్చేసరికి ప్రతీ బస్తాలో నాలుగైదు కిలోలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దాదాపు 30 శాతం గన్నీ సంచులు నాణ్యత కొరవడి చిల్లులు పడటం వల్లే తరుగు వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని రేషన్ డీలర్లు పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం ఇచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. సాంకేతిక సమస్యను సవరించి ఈ నెల నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు వేలిముద్ర వేసినప్పుడు ఈ-పాస్‌కు వేయింగ్ యంత్రాన్ని ఎలా అనుసంధానం చేస్తారో అదే విధానాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద డీలర్ల వేలిముద్రలతో బియ్యం అందజేయనున్నారు. ఈ విధానంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి డీలర్లకు సరఫరా చేసిన బియ్యం లెక్కలు ఈ-పాస్ ద్వారా కచ్చితంగా నమోదయ్యే అవకాశం ఉంది.గన్నీ సంచి తిరకాసుతో ఆలస్యం

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 9,79,920 కార్డులు ఉండగా.. కేంద్రం కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో.. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 18,043.735 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ సంచి బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు వాపోతున్నారు.

# వ్యాధుల కాలం.. జ్వరాల విజృంభణకు ఆస్కారం



సిరిసిల్ల: వ్యాధుల కాలం ప్రవేశించింది. భారీ వర్షాలు కురవకపోయినా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మలేరియా, డెంగీ, విష జ్వరాలే కాక కలుషిత నీటితో వాంతులు, విరేచనాలు, కామెర్లు, టైఫాయిడ్ తదితర వ్యాధులూ విజృంభించే అవకాశాలున్నాయి. గతేడాది జిల్లా వ్యాప్తంగా 50 డెంగీ, ఒక మలేరియా కేసు నమోదవగా, ఈసారి ఇప్పటికీ నమోదు కాలేదు. వర్షాలు ఎక్కువైతే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. వ్యాధుల ముప్పును తప్పించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. జిల్లాలో కాలానుగుణ వ్యాధుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ముందుగానే వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ఇక్కడ పారిశుద్ధ్య సమస్యతో తరచూ వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. వేములవాడ మండలం అనుపురం, చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీ, శాత్రాజుపల్లి, వేములవాడ గ్రామీణ మండలం వట్టెంల, కోనరావుపేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలంలోని ఎల్లారెడ్డిపేట, రంగంపేట, హరిదాస్‌నగర్, ఇల్లంతకుంటలో తాళ్లపల్లి, తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్, తంగళ్లపల్లి, చంద్రంపేట, మండెపల్లి, ముస్తాబాద్ మండలం కొండాపూర్, వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో ప్రగతినగర్, శాంతినగర్, భగవంతరావునగర్‌లు ఉన్నాయి. మొత్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 గ్రామాలు, మూడు వార్డులను గుర్తించారు. ఇక్కడ ముందస్తుగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య, ఆరోగ్య కమిటీలతో సమావేశాలు నిర్వహించి అప్రమత్తం చేశారు. కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తే పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తొమ్మిది మంది సభ్యులతో రాపిడ్ యాక్షన్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వ్యాధులు అదుపులోకి వచ్చేవరకు ఈ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుంది.

అన్‌టైడ్ నిధులేవీ?

పంచాయతీల్లో తాగునీటి పథకాల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే వర్షం నీరు వీధులు, మురుగు కాల్వల్లో సాఫీగా వెళ్లేలా చూడాలి. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రతి పంచాయతీకి అన్‌టైడ్ నిధులను వర్షాకాలం ప్రారంభం జూన్‌లోనే కేటాయిస్తోంది. ఈసారి ఇప్పటికీ రాలేదు. ఒక్కో పంచాయతీకి రూ.5 వేల చొప్పున ఏటా రూ. 10.55 లక్షలు కేటాయిస్తారు. కానీ కొత్త పంచాయతీలను జాతీయ ఆరోగ్య మిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు జిల్లాలో 211 ఉన్న పంచాయతీలు 255కు చేరాయి. నిధులు మాత్రం పాత పంచాయతీల ప్రకారమే విడుదల చేస్తోంది. వీటిని ఆయా పంచాయతీలకు సర్దుబాటు చేస్తున్నారు.

నీటి శుద్ధి.. దోమల నివారణ

జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఇటీవల పచ్చకామెర్ల వ్యాధితో చికిత్స పొందిన వారు ఎక్కువగా ఉన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో కలుషిత నీరు తాగడంతో వస్తుంది. ఏప్రిల్, మే నెలల్లో ఈ వ్యాధితో చికిత్స పొందారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. రాజరాజేశ్వర జలాశయం వెనక జలాల సమీపంలోని గ్రామాల్లో ఈ వ్యాధి లక్షణాలు తరచూ కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇళ్ల సమీపంలో నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటితో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

నివారణ చర్యలు చేపడుతున్నాం

జిల్లాలో ఇప్పటి వరకు పరిస్థితి అదుపులోనే ఉంది. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మంగళ, శుక్రవారాలు డ్రైడేలుగా పాటించేలా సిబ్బందికి సూచనలు ఇచ్చాం. పంచాయతీ, పురపాలక శాఖలు మురుగు గుంతలు, కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలి. అబెట్ ద్రావణం పిచికారీ చేయించాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. శ్రీరాములు, జిల్లా కాలానుగుణ వ్యాధుల నియంత్రణ అధికారి

# పల్లె చెంతకే మెరుగైన వైద్యం



సిరిసిల్ల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అందుబాటులో ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అన్ని రకాల టీకాలు, వివిధ పరీక్షలను నిర్వహించి, ఫలితాలు అందించే యంత్రాలతోపాటు రక్తకణాలు(సెల్ కౌంట్) లెక్కించే యంత్రాలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రస్తుతం ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ఉప కేంద్రాల పరిధిలోనూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించేందుకు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి రోగాలను పరీక్షించేందుకు పరికరాలను సిబ్బందికి అందించారు. దీనిద్వారా గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేవలందే అవకాశం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా అయిదు పట్టణ, 19 పీహెచ్‌సీలు ఉండగా, 151 ఆరోగ్య ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో 24 గంటలు రోగులకు సేవలందించేందుకు సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్, మల్లాపూర్, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, ధర్మపురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 151 ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్పు చేసి వైద్యులను, 'మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్' (ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించారు. ఆయా కేంద్రాల పరిధిలో ప్రస్తుతం 299 రక్తపోటు, మధుమేహం పరీక్షించే పరికరాలను అందించారు.

పేదలందరికీ..

ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలను నెలకొల్పగా, పల్లెల్లోనూ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు పల్లె దవాఖానాలను తీసుకువచ్చింది. ప్రాథమిక స్థాయిలోనే నిరుపేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో పల్లె దవాఖానాలు పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగానే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెల పరీక్షలు నిర్వహించేందుకు(రక్తపోటు, మధుమేహం) పరికరాలను అందించారు. వీటి ద్వారా గ్రామాల్లో ఉప కేంద్రానికి రాలేని వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేయనున్నారు. క్యాన్సర్‌లోని మూడు రకాలపై అవగాహన కల్పించడమే కాకుండా ప్రాథమికంగా లక్షణాలతో ఉన్న అనుమానితుల్ని సిబ్బంది గుర్తించి వైద్యులకు సిఫారసు చేస్తారు. గుట్కా, బీడీ, మద్యం సేవిస్తే వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామంలో అవగాహన కల్పిస్తారు. మంచానికే పరిమితమైన వారిని గుర్తించి ఇంటికి వెళ్లి మందులు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా దవాఖానాల్లో ప్రస్తుతం సాధారణ ఓపీ, గర్భిణులకు పరీక్షలు, చిన్నపిల్లలకు టీకాలు, అసాంక్రమిక వ్యాధుల నిర్ధారణ, మందుల పంపిణీ సేవలు అందుతున్నాయి. అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలను రక్త, మూత్ర నమూనాలను సేకరించి, సమీపంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రానికి పంపించి ఫలితాలు అందిస్తున్నారు.

దీర్ఘకాలిక రోగుల వద్దకు..

ప్రభుత్వం పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతున్నందున ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని, వివిధ రకాల రక్త పరీక్షలను అందుబాటులో చేయడమే కాకుండా ఫలితాలు అందిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాలతోపాటు ఉప కేంద్రాల పరిధిలో దీర్ఘకాలిక రోగులు రాలేని పరిస్థితి ఉంటే సిబ్బంది అక్కడికి వెళ్లి పరీక్షలు నిర్వహించనున్నారు.

షమీయోద్దీన్, జిల్లా ఎన్‌సీడీ, వెల్‌నెస్ సెంటర్ ప్రోగ్రాం అధికారి

## పొద్దంతా ఒడ్డుకు.. రాత్రయితే పట్టణాలకు

హుజూరాబాద్: గోదావరి తీరం నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ఎస్సారెస్పీ నిండడంతో వరద నీరు వదలడంతో గోదావరిలో ఇసుక మేటలు ఎక్కువయ్యాయి. జగిత్యాల జిల్లా పరిధిలోని బీర్‌పూర్, ధర్మపురి, మల్లాపూర్, రాయికల్ మండలాల్లో గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని నదీ తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా జగిత్యాల పట్టణానికి యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతుంది. రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇసుకను నదీ ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు.

రీచ్‌ల ఏర్పాటులో జాప్యం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ఏటా గోదావరి తీరం వెంట అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, రేకులపల్లె, చిత్రవేణిగూడెం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అనువుగా ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకంతా తరలిపోయింది. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది.

ఇతరులు వెళితే అభ్యంతరమే!మండలంలోని గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు ఇసుకను తీసుకువచ్చేందుకు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకునే వీలుంటుంది. దీనిద్వారా ట్రాక్టర్ యజమానులు గృహ అవసరాలకు ఒక్కో ట్రిప్పుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు కాగా, టిప్పరు రూ.20 నుంచి రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. ఎక్కడైనా అడ్డుకుంటే అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు.

# ఇక పక్కాగా రేషన్ బియ్యం లెక్క!

హుజూరాబాద్: ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ప్రజా పంపిణీలో అమలు చేసే సాంకేతికతను ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ఈ నెల నుంచే రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గిడ్డంగులకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

తీరనున్న తరుగు కష్టాలు

ఉమ్మడి జిల్లాలోని 14 ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి 1,964 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతుంది. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. తమ దుకాణాలకు వచ్చేసరికి ప్రతీ బస్తాలో నాలుగైదు కిలోలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దాదాపు 30 శాతం గన్నీ సంచులు నాణ్యత కొరవడి చిల్లులు పడటం వల్లే తరుగు వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని రేషన్ డీలర్లు పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం ఇచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. సాంకేతిక సమస్యను సవరించి ఈ నెల నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు వేలిముద్ర వేసినప్పుడు ఈ-పాస్‌కు వేయింగ్ యంత్రాన్ని ఎలా అనుసంధానం చేస్తారో అదే విధానాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద డీలర్ల వేలిముద్రలతో బియ్యం అందజేయనున్నారు. ఈ విధానంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి డీలర్లకు సరఫరా చేసిన బియ్యం లెక్కలు ఈ-పాస్ ద్వారా కచ్చితంగా నమోదయ్యే అవకాశం ఉంది.

గన్నీ సంచి తిరకాసుతో ఆలస్యం

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 9,79,920 కార్డులు ఉండగా.. కేంద్రం కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో.. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 18,043.735 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ సంచి బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు వాపోతున్నారు. అందుకే ప్రతి నెలా 26వ తేదీ నుంచి గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలోని చాలామంది డీలర్లు సోమవారం వరకూ తీసుకోలేదు. గన్నీ సంచి బరువు తీసివేసి బియ్యం ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారని, నుంచి బియ్యం తీసుకుంటామని డీలర్లు చెబుతున్నారు. ప్రతినెలా 5వ తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండటంతో ఇకపై ప్రతినెలా 7వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరాగత ఫిబ్రవరిలో డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం ఇవ్వాలని భావించినా సాంకేతిక సమస్యతో అమలు చేయలేదు. ఈ నెల నుంచి ప్రతీ డీలర్‌కు బయోమెట్రిక్ ద్వారానే బియ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. గతంలో బియ్యం తరుగు వస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చేవి. ఇక నుంచి అలాంటి సమస్య ఉండదు. కార్డులు, యూనిట్ల ఆధారంగా ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం సరఫరా అవుతుంది. నిబంధనలకు అనుగుణంగానే బియ్యం ఇవ్వాలని గోదాం అధికారులకు సూచించాం. శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, పౌర సరఫరాల సంస్థ, కరీంనగర్

## పొద్దంతా ఒడ్డుకు.. రాత్రయితే పట్టణాలకు

సారంగాపూర్: గోదావరి తీరం నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ఎస్సారెస్పీ నిండడంతో వరద నీరు వదలడంతో గోదావరిలో ఇసుక మేటలు ఎక్కువయ్యాయి. జగిత్యాల జిల్లా పరిధిలోని బీర్‌పూర్, ధర్మపురి, మల్లాపూర్, రాయికల్ మండలాల్లో గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని నదీ తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా జగిత్యాల పట్టణానికి యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతుంది. రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇసుకను నదీ ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు.

రీచ్‌ల ఏర్పాటులో జాప్యం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ఏటా గోదావరి తీరం వెంట అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, రేకులపల్లె, చిత్రవేణిగూడెం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అనువుగా ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకంతా తరలిపోయింది. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది.

ఇతరులు వెళితే అభ్యంతరమే!మండలంలోని గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు ఇసుకను తీసుకువచ్చేందుకు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకునే వీలుంటుంది. దీనిద్వారా ట్రాక్టర్ యజమానులు గృహ అవసరాలకు ఒక్కో ట్రిప్పుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు కాగా, టిప్పరు రూ.20 నుంచి రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. ఎక్కడైనా అడ్డుకుంటే అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి తీరం వెంట దంపుల కొద్ది ఇసుక ఉన్నప్పటికీ ఏనాడు అధికారులు సీజ్ చేయకపోవడంతో దందా నిరంతరంగా కొనసాగుతుంది. అప్పుడప్పుడు పోలీసులు, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేస్తున్నప్పటికీ మైనింగ్ అధికారుల జాడ కనపడడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణానికి తరలుతున్న ఇసుక టిప్పర్‌ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకుడుబీర్‌పూర్ మండలంలో ఎలాంటి ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయలేదు.

# నైపుణ్య వికాసం.. ఉపాధికి ఊతం

ఖమ్మం : నేటి పోటీ ప్రపంచంలో పోరాడటానికి అవసరమైన నైపుణ్యం లేకుండానే విద్యార్థులు బయటకు వచ్చి కష్టపడుతున్నారు. డిగ్రీ పట్టాలు చేతపట్టుకొని ఉపాధి అవకాశాల కోసం దిక్కులు చూస్తున్నారు. నైపుణ్యాల మెలకువలు లేక ఉద్యోగ వేటలో చతికిలబడు తున్నారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఉద్యోగ పోటీ పరీక్ష ఎదుర్కొనే సత్తా లేక నిరాశకు గురవుతున్నారు. అత్యుత్తమ శిక్షణ, భవితకు నిచ్చెన... ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ అన్ని రంగాల్లో అభ్యసించే విద్యార్థులకు అతి తక్కువ రుసుముతో అత్యున్నత ప్రమాణాలున్న శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలు ఎలా ఉన్నాయి, ఉద్యోగుల నుంచి యాజమాన్యాలు ఎలాంటి నైపుణ్యాలు ఆశిస్తున్నాయనే అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, రీజనింగ్‌తో పాటు జావా, పైథాన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్, డాటా సైన్స్, బ్లాక్‌చైన్ లాంటి ఆధునిక సాంకేతిక అంశాల శిక్షణతో పాటు ఆయా కంపెనీల భాగస్వామ్యంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నారు.

గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు సాన... గ్రామీణ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఈ కోర్సుల్లో ప్రతిభకు సానపడుతున్నారు. ప్రత్యేక కార్యశాలలు నిర్వహించి నిపుణుల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. స్థానిక కళాశాలల్లో బోధకులతో పాటు ప్రత్యేకంగా టాస్క్ బృందం సభ్యులు కళాశాలలకు వచ్చి బోధిస్తున్నారు.

ఆలోచనలకు సాంకేతికత జోడింపు... ఉద్యోగాల చుట్టూ విద్యార్థుల ఆలోచనలు తిరగకుండా వినూత్నమైన మార్గాలను ఎంచుకుని విజయం సాధించే దిశగా చేయూత ఇస్తున్నారు. పరిశ్రమలు నెలకొల్పడంలో మెలకువలు, అవసరాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆలోచనలకు సాంకేతికత



జోడించి అవకాశాలు ఎలా సృష్టించాలనే ఆలోచనలను నేర్పిస్తున్నారు. కొరవడుతున్న ఆసక్తి... విద్యార్థుల భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దే నైపుణ్య శిక్షణపై పలువురు ఆసక్తి చూపటం లేదు. వివిధ కారణాలతో ఇంజినీరింగ్, డిగ్రీ చదువుకునే విద్యార్థులు ముందుకు రావడం లేదు. శిక్షణ పొందేందుకు విద్యార్థులు కొంత రుసుము చెల్లించేందుకూ వెనుకాడుతున్నారు. కొన్ని కళాశాలలు కూడా నమోదు చేసుకోవడం లేదు. కళాశాలలు నమోదు/రెన్యూవల్ చేసుకునేందుకు తుది గడువు: జులై 15 బీ విద్యార్థులు నమోదు చేసుకునేందుకు తుది గడువు: ఆగస్టు 30

వారధిగా నిలుస్తున్న 'టాస్క్'...

కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించడం తప్ప వారికి సరైన ఉపాధి మార్గాలు చూపడం లేదు. కళాశాల విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అవకాశాలు కోల్పోతున్న యువతకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'టాస్క్'(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) వారధిగా నిలుస్తోంది. నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా రూపకల్పన చేసిన ఈ సంస్థ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఒక వైపు చదువు, మరో వైపు జీవితంలో అవసరమైన నైపుణ్యాలను టాస్క్ పదును పెడుతోంది. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థుల నమోదు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40 కళాశాలలు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా సుమారు 3,500 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు.

బహుళజాతి సంస్థల భాగస్వామ్యం...

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం చేపట్టిన 'టాస్క్'లో బహుళజాతి సంస్థలను భాగస్వాములను చేసింది. నైపుణ్యాలున్న అభ్యర్థులను కోరుకుంటున్న పరిశ్రమలకు టాస్క్ వేదికగా పని చేస్తోంది. ఈ సంస్థలో నమోదు చేసుకున్న విద్యార్థులకు దిగ్గజ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. టాస్క్ ఐటీతో పాటు పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో చదువు పూర్తి చేసుకున్న వారికి భాగస్వామ్య సంస్థల్లో ప్రవేశాలు ఉంటే సమాచారం అందిస్తారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన వారికి వివిధ సంస్థల్లో కొలువులు లభించాయి.

# నిర్లక్ష్యంతో మళ్లీ ముంచేస్తారా..?



భద్రాచలం : ప్రకృతి ప్రకోపం కన్నా మానవ తప్పిదాలే గోదావరి తీరప్రాంత వాసులకు గండంగా మారాయి. చిన్నపాటి నిర్లక్ష్యం వేలమందిని ముంపు ముంగిట్లోకి నెట్టేస్తోంది. భద్రాచలం వద్ద గతేడాది జులైలో గోదావరి వరద బీభత్సంతో ఊళ్లన్నీ ఏర్లుగా మారాయి. దారులన్నీ సముద్రాలను తలపించాయి. ముందుచూపు కొరవడటంతో విస్తా కాంప్లెక్స్ ఏరియాలో బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోసే మోటార్లు మొరాయించి రామాలయ పరిసరాలు నీటమునిగాయి. కరకట్టకు మరమ్మతులు చేయకపోవడంతో అయ్యప్పకాలనీ, కొత్తకాలనీ జలమయమయ్యాయి. ఇదే కట్టను పొడిగించకుండా అలసత్వం ప్రదర్శించటంతో సుభాశ్‌నగర్, శాంతినగర్ ప్రాంతాలు వరద కష్టాలను చవిచూశాయి. భద్రాచలంతో పాటు బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, పినపాక తదితర మండలాల్లో అపార నష్టం వాటిల్లింది. ఇప్పటికీ చినుకు పడితే ప్రజలు వణికిపోతున్నారు. అయినా అధికారులు నామమాత్రపు సమీక్షలతో సరిపెట్టేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే కలెక్టర్ సమీక్ష జరిపారు. బఫర్ స్టాక్ కొద్దిమేర సిద్ధమైంది. మిగతాది ఎంపిక చేసిన ప్రాంతాల్లో రెండ్రోజుల్లో అందుబాటులో ఉంటుంది. సెక్టోరియల్, నోడల్ అధికారుల నియామక ప్రక్రియ సాగుతోంది. డివిజన్ స్థాయిలో త్వరలో సమీక్షిస్తాం.

రత్నకల్యాణి, ఆర్డీఓ

అప్రమత్తత అవసరం

గతేడాది అధికారిక లెక్కల ప్రకారం భద్రాద్రి జిల్లాలో 16వేల నివాసాలు నీటమునిగాయి. బతుకుజీవుడా అంటూ సురక్షిత ప్రాంతాలకు ప్రజలు తరలిపోయారు. మరికొందరు అధికారులు ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాలకు చేరుకున్నారు. వరద తగ్గిన అనంతరం ఇళ్లకు వెళ్లారు. అశ్వాపురం, మణుగూరు, పినపాక, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోనూ వరద తీవ్రత ఎక్కువే. వానాకాలం ప్రారంభమైన తరుణంలో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమవ్వాలి.

బఫర్ స్టాక్ ఏదీ..?

సురక్షిత ప్రాంతంలో మూడు నెలలకు సరిపడా బియ్యం, ఇతర ఆహార పదార్థాలు నిల్వ చేయడమే బఫర్‌స్టాక్ ఉద్దేశం. రవాణా వ్యవస్థ స్తంభించినా తిండికి ఇబ్బంది రాకుండా దీన్ని చేపడుతుంటారు. ఈప్రక్రియ ఇదివరకే పూర్తికావాల్సి ఉన్నప్పటికీ బఫర్ స్టాక్ ఎక్కడెక్కడ ఎంత నిల్వ చేస్తారో స్పష్టత కరవైంది. ఏయే స్థాయుల్లో వరదొస్తే ఎన్ని ఆవాసాలకు ప్రమాదమో ముందే హెచ్చరించేందుకు సెక్టోరియల్, నోడల్ అధికారులను నియమించాలి. వైర్‌లెస్ సెట్లు, మొబైల్ బృందాలను అప్రమత్తం చేయాలి. రోడ్లు మునిగితే ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రణాళిక రూపొందించాలి. భద్రాచలం వంతెనపై గతేడాది రాకపోకలను నిలిపేయటంతో అంతర్రాష్ట్ర రవాణా స్తంభించింది. పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పించి పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులపై దృష్టి సారించాలి. గజ ఈతగాళ్లకు కూలి చెల్లించటంలో నాన్చుడు ధోరణి వీడాలి. లాంచీలతో పాటు మరబోట్లను సిద్ధం చేయాలి. ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలి. ఈ అంశాలపై భద్రాచలం కేంద్రంగా అధికారులు సమీక్ష జరపాలి.

వివిధ రకాల హెచ్చరికల స్థాయిలు

43 అడుగులకు నీటిమట్టం చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 48 అడుగులకు రెండోది, 53కు మూడోది అమల్లోకి వస్తుంది. గతేడాది 120 గ్రామాలకు వరద సమస్య తలెత్తింది. 16 వేల కుటుంబాలకు 80 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

# దూసుకుపోతున్నారు..!

భూపాలపల్లి : అధిక సీసీ.. డిస్క్, ఏబీఎస్ బ్రేకులు.. గేర్ వేస్తే చాలు రయ్‌మంటూ వెళ్లే ఆధునిక బైక్‌లు.. యువత అభిరుచులకు అనుగుణంగా ఆయా కంపెనీలు నయా మోడళ్లను అందుబాటులోకి తెస్తుండగా.. వాటిని నడుపుతూ గాల్లో తేలుతున్నారు. ఈ క్రమంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపై గాలితో పోటీపడుతూ నడపడం, వంకరటింకరగా తిప్పుతూ.. బండిని నేలకు తాకిచ్చేలా విన్యాసాలు చేయడం.. చేతులు వదిలేస్తూ సాహసాలు చేయడం వంటి వాటితో ప్రాణాలే పణంగా పెడుతున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రహదారులపై అత్యధికం ద్విచక్ర వాహన ప్రమాదాలే ఉండటం కలవరపరుస్తోంది.. ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోతున్నాయి.

సామర్థ్యం చాలా ఎక్కువ!

ఆధునిక, స్పోర్ట్స్ ద్విచక్ర వాహనాల సామర్థ్యం 220 సీసీ మొదలుకొని 550 సీసీ వరకు ఉంటోంది.. బండి స్టార్ట్ అయిందంటే ఎక్స్‌లేటర్ ఇస్తే ఒక్కసారిగా 40 నుంచి 60 స్పీడ్ అందుకుంటుంది. ఆ తర్వాత గుంతల్లేని రహదారులపై 130 నుంచి 150 కి.మీ వేగంతో దూసుకపోతున్నారు. వాహనాల టైర్లు వెడల్పుగా ఉండటం, బండి కుదుపులకు లోనవకుండా వెళ్తుండడంతో జెట్ వేగంతో వెళ్తున్నారు.

ప్రమాదాలకు కారణాలివీ..

అతివేగంతో పాటు విన్యాసాలకు ప్రయత్నించడం

విశ్రాంతి లేకుండా దూర ప్రయాణం చేయడం

కూడళ్లు, ప్రధాన రహదారుల్లో అపసవ్య దిశలో వెళ్లడం..

మద్యం మత్తులో వాహనాలు నడపడం.

ద్విచక్ర వాహనాలపై సామర్థ్యానికి మించి ప్రయాణం...

పాటించాల్సిన జాగ్రత్తలు

స్పోర్ట్స్ బైక్‌తో కుర్రకారు రయ్‌మని దూసుకుపోతున్నారు. కొంత మంది శిరస్త్రాణాన్ని భారంగా భావిస్తున్నారు. జుట్టు ఊడిపోతుందని, ముఖం వాలిపోతుందని ధరించడం లేదు. ప్రాణాలకంటే అవేవీ ఎక్కువ కాదనుకొని శిరస్త్రాణం ధరించాలి.

శిరస్త్రాణం లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి గురైతే ఎలాంటి బీమా వర్తించదు.

స్పోర్ట్స్ ద్విచక్ర వాహనం బరువు దాదాపుగా 1.10 టన్నులు ఉంటుంది. వేగంగా వెళ్తూ ఏమాత్రం అదుపు తప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే..

లి రహదారుల నిబంధనల ప్రకారం మాత్రమే ముందుకుసాగాలి. రోడ్ల వెంట స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేసి ఉంటాయి. సూచించిన ప్రకారం వేగం ఉండాలి.

స్పోర్ట్స్ వాహనం ఇంజిన్ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తక్కువ సమయంలో స్పీడ్ ఎక్కువగా అందుకుంటుంది. సాధ్యమైనంత వరకు నెమ్మదిగానే నడపాలి.

సామర్థ్యం మించి వాహనంపై ఎక్కుకూడదు. ఇద్దరికి మించి కూర్చోరాదు. ముగ్గురు ఎక్కితే బ్యాలెన్స్ తప్పి పడిపోయే అవకాశం ఉంటుంది. రాంగ్ రూట్‌లో ప్రమాదం జరిగితే కారకుడైన వ్యక్తి రూ.20 లక్షల పరిహారాన్ని ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి రాంగ్‌రూట్‌లో ఎట్టి పరిస్థితుల్లో వెళ్లరాదు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

-సురేందర్‌రెడ్డి, ఎస్పీ, భూపాలపల్లిరోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. అతివేగం, అజాగ్రత్తల వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం.

# ఆలోచనలకు పదును.. ఆవిష్కరణలకు అదను




కొత్తగూడెం : విద్యార్థులు, యువతలో దాగి ఉన్న కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రేరేపించేలా 'ఇంటింటా ఇన్నోవేషన్' కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల ప్రదర్శన చేపట్టనున్నారు. కొవిడ్ నేపథ్యంలో నాలుగేళ్లుగా ఆన్‌లైన్ ద్వారానే ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆన్‌లైన్ ఎగ్జిబిషన్ లింక్ ద్వారా ఈ ఆవిష్కరణలను తిలకించవచ్చు.

దరఖాస్తులు వాట్సాప్ ద్వారా..

ఇంటింటా ఇన్నోవేషన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు అంతర్జాలంలో ప్రాజెక్టును ప్రదర్శించాలి. ముందుగా తమ ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ఏదైనా ప్రాజెక్టును వివరాలతో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. తమ ఆవిష్కరణలకు సంబంధించిన ఆరు వ్యాఖ్యలు రెండు నిమిషాల వ్యవధితో ఉన్న వీడియో, ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు చిత్రాలు, ఆవిష్కర్త పేరు, చరవాణి నంబరు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరు తదితర వివరాలను 91006 78543 అనే నంబరుకు వాట్సాప్ ద్వారా పంపించాలి. వీటిని రాష్ట్ర ఇన్నోవేషన్ విభాగం పరిశీలించి జిల్లా నుంచి ఐదు ఆవిష్కరణను ఎంపిక చేస్తుంది. ఎంపిక చేసిన ఐదు ఆవిష్కరణలను, స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలో వచ్చిన వాటిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారు. అదేరోజు వాటిని ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శిస్తారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలతోపాటు అవార్డులను అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విజేతకు రూ.లక్ష వరకు నగదు బహుమతి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల నుంచి ఒక ఆవిష్కరణను తప్పనిసరిగా పంపించేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాల్సి ఉంటుంది.

యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అందరికీ అవకాశం కల్పిస్తూ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నూతన ఆవిష్కరణలతో ప్రతిభను చాటేందుకు ఇది చక్కని అవకాశం. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకుని ప్రదర్శన కనబరిస్తే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విద్యార్థులు చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో టీఎస్ఐసీ, డీఎస్‌వో, ఖమ్మం అనే ఐడీకి ట్యాగ్ చేస్తే మరింత ప్రచారం జరుగుతుంది. చలపతిరాజు, జిల్లా సైన్స్ అధికారి, భద్రాద్రి

# సమస్యలపై చర్చిస్తేనే.. ప్రగతి పథం!

భూపాలపల్లి : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ ఆవరణలోని ఇల్లందు క్లబ్‌హౌజ్‌లో నిర్వహించనున్నారు. జిల్లా అభివృద్ధే ఎజెండాగా సమస్యల పరిష్కారానికి సమావేశంలో సభ్యులు చర్చించనున్నారు. అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. సమావేశానికి సంబంధించి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి.. గతంలోలాగా సాదాసీదాగా కాకుండా పలు శాఖల పనితీరుపై సమీక్షించి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జడ్పీ సమావేశానికి భూపాలపల్లి, మంథని, ములుగు ఎమ్మెల్యేలు, వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి ఎంపీలు హాజరుకావాల్సి ఉన్నా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాత్రమే హాజరవుతున్నారు. మిగతా ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకాకపోవడంతో జిల్లా అభివృద్ధిపై సమగ్ర చర్చ జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేడు నిర్వహించే సమావేశానికైనా వారు హాజరైతే సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉంది. నెలకొన్న సమస్యలివే.. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. చాలా మండలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో నిరుపేద లబ్ధిదారులు నిరాశలో ఉన్నారు. లి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తుండటంతో ఇరుకు గదులతో పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. లి నిరుద్యోగ యువతీ, యువకులను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు అందించే కార్యక్రమం జిల్లాలో నిలిచిపోయింది. నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. మైనార్టీ శాఖ ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తులు తీసుకున్నా ఎంత మందికి రుణాలు ఇచ్చారో తెలియని పరిస్థితి. అన్నదాతలకు పంట రుణాలను అందించడంలో బ్యాంకులు లక్ష్యం మేరకు పనిచేయడం లేదు. బ్యాంకర్లు పెడుతున్న షరతుల కారణంగా అన్నదాతలు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. పంట రుణ లక్ష్యంపై సభ్యులు చర్చించి లక్ష్యం చేరకపోవడానికి కారణాలపై చర్చించాల్సి ఉంటుంది. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను చేపట్టేలా వైద్యశాఖ చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి నిర్వాహకులకు అందించాల్సిన కమీషన్ పెండింగ్‌లో ఉంది. ఈ అంశంపై చర్చించి నిధులు త్వరగా విడుదలయ్యేలా చూడాలి. కొన్నేళ్లుగా నూతన రేషన్ కార్డుల ప్రక్రియ నిలిచిపోయింది. పేద కుటుంబాలకు రేషన్ సరకులు అందక ఇబ్బందులు పడుతున్నారు. రూర్బన్ మిషన్ పథకం ద్వారా భూపాలపల్లి మండలం నాగారం క్లస్టర్‌లో 19 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి పట్టణ వసతులు కల్పించాలి. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం తదితర పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పనుల పురోగతిపై చర్చించి త్వరితగతిన పూర్తి చేయాలి.

# అమ్మకు అనారోగ్యం..

ఖమ్మం : మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రారంభమైన ఈ పథకంలో ఇప్పటి వరకు జిల్లాలో 3,281 మంది మహిళలు చికిత్సలు తీసుకున్నారు. వీరిలో 11 మంది వివిధ రకాల క్యాన్సర్లతో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు గుర్తించారు. వారందరినీ ఎంఎన్‌జే ఆస్పత్రికి రిఫర్ చేసి ఉచితంగా చికిత్సలు అందిస్తున్నారు. కేంద్రాల్లో ఏం చేస్తారు.. ఈ కేంద్రాల్లో ఎనిమిది రకాల వైద్య సేవలందిస్తున్నారు. అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు చేస్తారు. సర్వజన ఆస్పత్రిలో థైరాయిడ్, సూక్ష్మ పోషకాల లోపం, అయోడిన్, ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్-బీ12, విటమిన్-డి, మూత్రకోశ ఇన్ఫెక్షన్లు, ఫెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ సంబంధిత పరీక్షలు చేస్తూ సమస్యలను నిర్ధారిస్తున్నారు. లైంగిక వ్యాధులు, సంతాన, నెలసరి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ ఇస్తున్నారు. బరువు నియంత్రణకు యోగా, వ్యాయామం వంటి వాటిపై సూచనలు చేస్తున్నారు. మామోగ్రఫీ, యూఎస్‌జీ అబ్డామిన్, పాప్‌స్మెర్ వంటి పరీక్షలు చేసి ఆరుగురు రొమ్ము, ఐదుగురు గర్భాశయ క్యాన్సర్లతో బాధపడుతున్నట్లు తేల్చారు. బాధితులను హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

వైద్య సేవలు ఇలా...ఆరోగ్య మహిళ కార్యక్రమంలో జిల్లాలో ప్రతి మంగళవారం నిర్దేశించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా వైద్య సేవలందిస్తున్నారు. శిక్షణ పొందిన మహిళా వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ రోగులను పరీక్షిస్తున్నారు. బోనకల్లు, చెన్నూరు, కామేపల్లి, ఎంపీపాలెం, మంచుకొండ, వైరా ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన తర్వాత అవసరమైన వారిని ఉన్నతస్థాయి వైద్యం కోసం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నా కుటుంబీకులతో చర్చించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారు కొందరైతే.. వ్యాధి లక్షణాలపై అవగాహన లేనివారు, ఆర్థిక సమస్యలతో బాధపడే వారు ఉచితంగా ఆరోగ్య మహిళా కేంద్రాలకు వెళ్లి చికిత్సలు తీసుకుంటూ మందులు వాడుతున్నారు.

# రామాలయం ఆన్‌లైన్ సేవలు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలను ఆరంభించేందుకు సర్వం సిద్ధమైంది. దీంతో భక్తుల సుదీర్ఘ కాల కోరిక నెరవేరనుంది. ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఈవో రమాదేవి ప్రత్యేక చొరవతో అంతర్జాల ప్రక్రియను పూర్తి చేయించారు. అంతర్గతంగా ట్రయల్‌రన్ నిర్వహించి జాగ్రత్తలు చేపట్టారు. కౌంటర్లలో విధులు నిర్వహించే సిబ్బందికి కంప్యూటర్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. నేరుగా వచ్చే యాత్రీకులు కౌంటర్‌లో రశీదులు తీసుకోవచ్చు. ఆంజనేయస్వామి ఆలయం వెనుక ప్రధాన టిక్కెట్ కౌంటర్, ప్రధాన ఆలయం వద్ద మరో రెండు కౌంటర్లు, ప్రసాదాల విభాగం వద్ద కంప్యూటర్లతో పాటు ప్రింటర్లను ఏర్పాటు చేయనున్నారు.

పూజలకు ప్రాధాన్యం.. ఆన్‌లైన్ ద్వారా రామాలయం క్షేత్ర చరిత్ర తెలుసుకోవచ్చు. రోజువారీ పూజలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాల వివరాలను ఇందులో ఉంచారు. ఏ పూజా రుసుం ఎంత ఉందో పేర్కొన్నారు. ఆర్జిత సేవలు, అభిషేకాల వివరాలను పొందుపర్చారు. ఉదయం సుప్రభాతం నుంచి రాత్రి నిర్వహించే పవళింపు వరకు ప్రతి అంశాన్ని నిక్షిప్తం చేశారు. దర్శనవేళలను పేర్కొన్నారు. రామాలయంలో చేసే ప్రతి ఉత్సవం గురించి భక్తులు తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు శ్రీరామ నవమి, ముక్కోటి ఏకాదశి వేళల్లో తాత్కాలిక వెబ్‌సైట్ ఉండేది. ఇక నుంచి శాశ్వత




ప్రాతిపదికన దేవదాయ శాఖ పరిధిలో ఇది పని చేయనుంది. ఈ అంతర్జాల సైట్ వివరాలను వెల్లడించనున్నారు. వసతి సదుపాయం ఇంకా ఆన్‌లైన్ కాలేదు. కొద్ది రోజుల తర్వాత కాటేజీల వివరాలతో పాటు సత్రాలు, సదనాల గదుల సమాచారం పొందుపర్చనున్నారు.

ముఖ్య సమాచారం ఇలా.. సహస్ర నామార్చన (రూ.200), మూలవరుల వద్ద అర్చన (రూ.300), నిత్య కల్యాణం (రూ.1500), అభిషేకం (రూ.1500), సుప్రభాతం (రూ.200), పవళింపు (రూ.200) వంటి టిక్కెట్‌లను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. చరవాణిలతో ఆలయ ప్రవేశం లేనందున ఆన్‌లైన్‌లో బుక్ చేసిన టికెట్ ప్రింట్ కాపీని తీసుకురావాలి.

# కట్టుతప్పితే కొరడా

బాసర : బాసర ట్రిపుల్‌ఐటీలో అధికారులు కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు. గత రెండునెలల నుంచి ఏదో ఒక ఆందోళనతో పతాకశీర్షికలతో వార్తల్లొకెక్కుతున్న ట్రిపుల్ ఐటీలో పరిస్థితులను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒకపక్క విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చడంపై దృష్టి సారిస్తూనే మరోపక్క ఆందోళనలు జరగకుండా చూసేందుకు ముందు జాగ్రత్తలు తీసకుంటున్నారు. తాజాగా విద్యార్థి ఆత్మహత్య ఘటన చోటుచేసకోవడంతో మళ్లీ విద్యా ర్థులు ఆందోళనకు దిగుతున్నారు. ఈ క్రమంలో యూని వర్సిటీ క్రమశిక్షణ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. వైస్ ఛాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్‌కుమార్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ప్రసుతం యూనివర్సిటీలో చోటుచేసుకుంటున్న పరిణామాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. యూనివర్సిటీని సరియ్నైన దిశలో నడిపించే విధంగా చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. కమిటీ సూచనలను, వారి అభిప్రాయాలను యూనివర్సిటీ ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి యూనివర్సిటీలో ఆందోళనలు, నిరసనలు, సమావే శాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు తెలిసిం ది. ముందస్తు సమాచారం, అనుమతులు లేకుండా విద్యార్థులు కాని, సిబ్బంది కాని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించే వీలులేదని అధి కారులు స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని విభాగాలకు ఉత్వర్వులు కూడా జారీ చేసినట్లుతెలిసింది. అధికారులు పేర్కొంటున్న ఈ క్రమశిక్షణ నిబందనలన్నీ యూనివర్సిటీ పరిపాలనలో భాగమై ఉన్నాయి. కాని ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కఠిన నియమ నిబంధనలను అమలు చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అందులో భాగంగానే కొన్ని రోజుల క్రిందట తరగతి గదులు, పరిపాలన భవనం, ల్యాబ్‌లలో సెలఫోన్ వినియోగంపై నిషేధాన్ని విధించారు. ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో కూడా యూనివర్సిటీ ఉన్నతాధికారులు రూల్‌బుక్‌ను ప్రతి విభాగానికి అందించారు. యూనివర్సిటీ విధించే నిబంధనలు ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి వరకు అందరికీ వర్తిస్తాయని అతిక్రమిస్తే ఎవరికైనా శిక్షలు తప్పవని హెచ్చరిస్తున్నారు నిబంధనలకు లోబడి ఉండాల్సిందే : ట్రిపుల్ ఐటీ అధికారులుప్రతి సంస్థలోలాగే ట్రిపుల్ ఐటీలో ఎప్పటి నుండో రూల్‌బుక్ ఉంది. అందులో ఉన్ననిబందనలకు అనుగుణంగానే వైస్ ఛాన్సలర్‌తో పాటు కింది స్థాయి వరకు ప్రతిఒక్కరూ పాటించాల్సి ందేనని యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. అతిక్రమించి యూనివర్సిటీ వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తే అధికారులైనా, అధ్యాపకులైనా, సిబ్బందైనా, విద్యార్థులైనా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# శుద్ధ అబద్ధం

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సదుద్దేశంతో సరఫరా చేసిన శుద్ధజల పరికరాలు పాఠశాలల్లో నిరుపయోగంగా మారాయి. ఏళ్లతరబడి తరగతి గదుల్లో గోడలకు వేలాడుతూ పనికిరాకుండా పోయాయి. పిల్లలకు తాగునీళ్లు అందించడం ఏమోగానీ పరికరాలను సరఫరా చేసిన గుత్తేదారు ధన దాహం మాత్రం తీరింది. శుద్ధజలం అంతా అబద్ధంగా మారింది. తాగునీటి పరికరాల పేరిట లక్షలాది రూపాయలు దుర్వినియోగమయ్యాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఆరేళ్ల క్రితం జలమణి పథకంలో పాఠశాలలకు శుద్ధజల పరికరాలకు సరఫరా చేశారు. వాటిని పాఠశాలల్లో అమర్చకపోవడంతో పరికరాలు వృథాగా మారాయి.. అందులో కొన్ని పూర్తిగా పనికిరాకుండా పోయాయి. దీంతో లక్షల నిధులు వృథా కాగా విద్యార్థులు స్వచ్ఛమైన నీరు అందని ద్రాక్షగా మారింది. దీంతో విద్యార్థులు చేతి, బోరుపంపులపై ఆధారపడి దాహార్తిని తీర్చుకుంటున్నారు.

పరికరాల పేరిట నిధులు నేలపాలు..

మండల విద్యాధికారులు నీటివసతి ఉన్న పాఠశాలలను గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో కలిసి ఎంపిక చేశారు. వాటి వివరాలను ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించగా.. శుద్ధజల యంత్ర పరికరాలు మంజూరయ్యాయి. నీటిని శుద్ధిచేసే యంత్రంతో పాటు ట్యాంకు, వివిధ పరికరాలను బడులకు అందించి చేతులు దులుపుకొన్నారు. వాటిని పాఠశాలల్లో అమర్చి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే విషయాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో పరికరాలు పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయి.. రెండు, మూడు పాఠశాలలకు మినహా మిగతా బడుల్లో విద్యార్థులకు శుద్ధజలం అందలేదు. నీటిని శుద్ధిచేసే యంత్రాలు, ట్యాంకు, తదితర పరికరాలు ఆయా పాఠశాలల్లోని మూలకు చేరాయి. మిగతా వాటిల్లో పరికరాలు



పనికిరాకుండా పోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టినా.. ప్రయోజనం లేని విధంగా మారాయి. మంచిర్యాల జిల్లాలో 714 పాఠశాలలు ఉండగా.. రెండు విడతలుగా 85 పాఠశాలలకు శుద్ధజల ప్లాంట్లను పంపిణీ చేశారు. రెండు, మూడు చోట్ల మినహా ఎక్కడా పనిచేయడంలేదు. నిర్మల్ జిల్లాలో 735 పాఠశాలకు గాను 55 పాఠశాలలకు శుద్దజల ప్లాంట్లను మంజూరు చేశారు. అందులో 23 పాఠశాలల్లో మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా వాటిల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధజలాన్ని అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 690 పాఠశాలలు ఉండగా 40 బడులకు మంజూరు చేశారు. ఏ ఒక్క పాఠశాలలో కూడా అవి పనిచేయడంలేదు. వాటి వివరాలు సైతం అందుబాటులో లేవు.

కుమురం భీం జిల్లాలో 972 సర్కారు బడులు ఉండగా 38 పాఠశాలలకు మంజూరుకాగా..అవి ఎక్కడా కనిపించడం లేదు.

నిధులు మంజూరుకాగానే మరమ్మతులు చేయిస్తాం..

ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి మంచిర్యాల

పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమకాగానే చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్న పాఠశాలల్లో శుద్ధజల పరికరాలు నిరుపయోగంగా ఉన్నా.. వాటికి మరమ్మతులు చేయించడం వృథా అవుతుంది

# ఇసుక తోడేళ్లు

ఆసిఫాబాద్ : ఇసుకే బంగారం అయింది. ముఖ్యంగా ఆసిఫాబాద్ వంటి భిన్నమైన భౌగోలిక వసతులున్న చోట ఇసుక లభ్యతే అంతంత మాత్రం. అయితే ఆ కాస్త ఇసుక మేటలను కూడా మాఫియా అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతు అక్రమంగా తరలించి జోరుగా వ్యాపారం చేస్తోంది. ముఖ్యం గా చీకటి మాటున రహస్య ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుకను లారీల్లో నింపులోకొని ఇటు ఆదిలాబాద్, అటు హైదరాబాద్ వరకు యథేచ్ఛగా తరలిస్తున్న అధికార యంత్రాంగం మాత్రం ఏమీ పట్టనట్టుగా చోద్యం చూస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఇసుకాసురులు అధికారుల కళ్లు గప్పించి చిన్న, పెద్దవాగులు తేడా లేకుండా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. నిర్మాణరంగం పుంజుకోవడంతో..ప్రస్తుతం నిర్మాణ రంగం మళ్లీ పుంజుకోవడంతో ఇసుకకు డిమాండు పెరుగుతోంది. ఇదే అదనుగా స్మగ్లర్లు ట్రాక్టర్ల సహాయంతో భారీగా ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. ఆసిఫాబాద్ పెద్దవాగు, గుండి, రెబ్బెన మండలం గంగాపూర్ ప్రాంతాల్లో స్మగ్లర్లు జంకు, బొంకు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఇటు కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోనూ ఇంతకు మించిన స్థాయిలో ఇసుక స్మగ్లర్లు తవ్వకాలు జరుపుతున్నారు. ముఖ్యంగా కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు బ్రిడ్జి పరిసరాలు అలాగే ఇదే మండలంలోని అందవెల్లి వద్ద యంత్రాల సహాయంతో ఇసుక తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల కళ్లేదుటే జరుగుతున్నా చూసీచూ డనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వర్షాలకు వరదలు పోటెత్తడంతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో అందవెల్లి వద్ద మూడు మండలాలకు వారధిగా ఉన్న అందవెల్లి బ్రిడ్జి కుంగి పోయి దెబ్బతిన్నది. ప్రస్తుతం అటు వైపు రాక పోకలను నిలిపివేశారు. దీంతో ఈ మార్గంలో జనసంచారం తగ్గిపోవడంతో దీన్ని ఆసరగా తీసుకున్న ఇసుక స్మగ్లర్లు జగన్నాథ్‌పూర్ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి పిల్లర్లను ఆనుకునే ఎక్స్‌కవేటర్లు, కూలీల సహాయంతో నాణ్యమైన ఇసుక తవ్వకాల కోసం అడ్డగోలుగా చేపడుతున్నారు. దీంతో ఇప్పటికే దెబ్బతిన్న బ్రిడ్జికి మరింత ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడ తవ్వకాలపై అధికారులకు సమాచారం ఇచ్చినా ఈ దందా మాత్రం అ డ్డు అదుపు లేకుండా కొనసాగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇలా ట్రాక్టర్ల ద్వారా సేకరించిన ఇసుకను రహస్య ప్రాంతాల్లో డంప్ చేసి డిమాండును బట్టి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారని తెలుస్తోంది. రహస్య ప్రాంతాల్లో డంపు..జిల్లా వ్యాప్తంగా ఆయ వాగుల్లో ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను రహస్య ప్రాంతాలకు తరలించి డంప్ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా దూర ప్రాంతాలకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. కూలీల సహాయంతో ట్రాక్టర్లను నింపుతున్న స్మగ్లర్లు స్థానిక అవసరాలకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,200 నుంచి ఇసుక నాణ్యతను బట్టి రూ.1,500 వరకు తీసుకుంటున్నారు. అదే జిల్లాలోని ఇతర ప్రాంతాలకు రూ.3,500 నుంచి రూ.4వేల వరకు ట్రాక్టర్ చొప్పున విక్రయిస్తున్నారు. ఇదే ఇసుకను హైదరాబాద్, బెల్లంపల్లి, జైనూరు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాలకు లారీల్లో తరలిస్తే మాత్రం వేలల్లో సొమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇందులో హైదరాబాద్‌కు తరలించే లారీ ఇసుకకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలుకుతున్నట్టు చెబుతున్నారు. అయితే హైదరాబాద్‌కు తరలించే ఇసుకను ఎక్కువగా దహెగాం మండలంలోని ఎర్రవాగు పరిసరాల నుంచి భారీగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రీచ్‌ను గుర్తించినప్పటికీ ఏ కారణం చేతో టీఎస్‌ఎండీసీ తవ్వకాలు మాత్రం చేపట్టడం లేదు. అదే సమయంలో ఇక్కడ ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ అనుమతులు తీసుకున్నప్పటికీ అతన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఇసుక తవ్వకాలు చేపట్టకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం అతడు కూడా ఇసుక తవ్వకాలు చేపట్టడం లేదు. అయితే అదే స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ స్మగ్లింగ్ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎర్రవాగులో అక్రమంగా తవ్వుతున్న ఇసుకను స్మగ్లర్లు దహెగాం, బెల్లంపల్లి మీదుగా పెద్దఎత్తున హైదరాబాద్‌కు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై చాలా మంది రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్ప టికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వణుకు పుట్టిస్తున్న డెంగ్యూ




ఆదిలాబాద్ : కరోనా వైరస్ ముప్పు తప్పిందనుకుంటున్న తరుణంలోనే.. డెంగ్యూ జ్వరాల భయం మొదలయ్యింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 84 పాజిటివ్ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో పూర్తిగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో.. డెంగ్యూ వ్యాప్తి మరింతగా పెరిగిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాబోయే సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో డెంగ్యూ జ్వరాల విజృంభణ ఉంటుందని చెబుతున్నారు. గడిచిన పక్షం రోజుల్లోనే పది పాజిటివ్ కేసులు వచ్చినట్లు తెలుస్తుంది. ఇప్పటికే అధికారులు కట్టడి చర్యలు చేపట్టామని చెబుతున్నా.. కేసుల సంఖ్య భారీగా పెరగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే వానాకాలం సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ జ్వరాలు రావడం సర్వసాధారణమేనని అధికారులు చెబుతున్నా.. డెంగ్యూ భయంతో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్నపాటి జ్వరం, ఒళ్లునొప్పులు వచ్చినా డెంగ్యూ జ్వరమేమోనని భయపడుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు దోపిడీ దందాకు తెరలేపుతున్నాయి. ఎలాంటి జ్వరం వచ్చినా డెంగ్యూ జ్వరం అంటూ వసూలు దందాకు ఎగబడుతున్నాయి. సొంతంగానే ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకుని రక్త పరీక్షలు నిర్వహిస్తూ డెంగ్యూ జ్వరమంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా.. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మౌనం వహించడం గమనార్హం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రైవేట్ ఆసుపత్రుల ఇష్టారాజ్యంజ్వరం వచ్చిందని ఆసుపత్రికి వెళ్తే.. ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయంటూ బాధితులు వాపోతున్నారు. మ్యాక్ ఎలిసా టెస్టులు చేయకుండానే డెంగ్యూ వ్యాధి అంటూ ఆసుపత్రుల్లో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో రిమ్స్ ఆసుపత్రిలో తప్ప, ఎక్కడా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవకాశం లేదు. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా చికిత్సలు చేస్తూ బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. రక్త పరీక్షలు మొదలుకొని మందులు, బెడ్ చార్జీలు, ఇతర ఖర్చుల పేరిట వసూలు చేస్తున్నారు. మూడు నాలుగు రోజుల పాటు ఆసుపత్రుల్లో మాములు చికిత్సలు అందిస్తూ ఖరీదైన వైద్యం పేరిట ఒక్కో బాధితుడినుంచి రూ.50 వేల వరకు గుంజుతున్నారు. ఇది చాలదంటూ మళ్లీ టెస్టుల పేరిట అదనంగా దండుకుంటున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదేమిటని అడిగితే డెంగ్యూ జ్వరం తో పరిస్థితులు ప్రమాదకరంగా మారాయంటూ కుటుంబ సభ్యుల ను భయపెడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు అందిస్తున్న చికిత్సల పై వైద్య ఆరోగ్య శాఖకు డేలీ రిపోర్టు ఇవ్వాల్సి ఉన్నా.. కొన్ని ఆసుపత్రులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తుంది. గుట్టుచప్పుడుకాకుండా వైద్యాన్ని అందిస్తూ అడ్డగోలుగా బిల్లులు వసూలు చే స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఆర్‌ఎంపీ వైద్యుల కమిషన్ దందాతో ఆసుపత్రి ఖర్చులు మరింత పెరిగిపోతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలు గాలికి..జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిన తర్వాతనే సంబంధిత చికిత్సను అందించాల్సి ఉంటుంది. కానీ కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ర్యాపిడ్ టెస్టుల ద్వారానే డెంగ్యూ వ్యాధిని నిర్ధారణ చేస్తున్నాయి. దీంతో బాధితులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. మ్యాక్ ఎలిసా టెస్టు ద్వారానే డెంగ్యూ వ్యాధిని నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు ఇవేమీ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. అనుమానితుల రక్త నమునాలను రిమ్స్ ఆసుపత్రికి పంపిస్తే ఉచితంగానే వ్యాధి నిర్ధారణ చేసి వైద్య ఆరోగ్య శాఖ సంబంధిత ఆసుపత్రికి పూర్తి సమాచారం అందిస్తుంది. కారీ దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు ఎలాంటి లాభం ఉండదని భావించి సొంత ల్యాబ్‌ల్లోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తూ చికిత్సను అందిస్తున్నారు. అత్యవసర సమయంలో ర్యాపిడ్ టెస్టులను చేసినా.. తప్పనిసరిగా మ్యాక్ ఎలిసా టెస్టును చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒకవేళ ర్యాపిడ్ టెస్టులో పాజిటివ్ వచ్చినా.. ఎలిసా టెస్టులో మాత్రం నెగెటివ్ వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదంటున్నారు. ప్లేట్‌లెట్స్ మూడు లక్షల నుంచి రెండు లక్షల వరకు పడిపోయినా.. పెద్దగా ప్రమాదం ఉండదంటున్నారు. 20వేల నుంచి 30వేలలోపు ఉంటేనే ప్రమాదం అని గుర్తించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు డెంగ్యూ బాధితుల సంఖ్యను గోప్యంగా ఉంచి వైద్యం అందించడంతో అసలు కేసులు బయటకు రావడం లేదంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 84 పాజిటివ్ కేసులు మాత్రమే నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నా.. అనధికారికంగా మాత్రం వందలాది సంఖ్యలో బాధితులు డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తుంది. క్రమం తప్పకుండా ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీలు చేపడితే వాస్తవ విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.సమాచారం అందించాలని సర్క్యులర్ జారీ చేశాం: రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్ఇప్పటికే జ్వర బాధితుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని ప్రైవేట్ ఆసుపత్రులకు సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరిన బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించినా.. డెంగ్యూ నిర్ధారణ మాత్రం రిమ్స్ ఆసుపత్రుల్లోనే చేయాల్సి ఉంటుంది. ఎలిసా టెస్టు అనంతరమే డెంగ్యూ నిర్ధారణ అయినట్లు గుర్తించాలి. ర్యాపిడ్ టెస్టుల ద్వారా వ్యాధిని నిర్ధారణ చేసి, వైద్యం చేయడం సరైంది కాదు. డేలీ రిపోర్టును ఇవ్వాలని కోరుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా డెంగ్యూ చికిత్సలు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం.

# మంజూరైనవి పూర్తయితేనే కొత్తవి..

మంచిర్యాల : గ్రామాల్లోనే పనులు కల్పించి వలసల నివారణ కోసం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోతుండటంతో నిధులు వృథా, దుర్వినియోగం అవుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటి నివారణకు చర్యలు చేపట్టింది. గ్రామానికి మంజూరు చేసిన పనులు వందశాతం పూర్తి చేస్తేనే కొత్త పనులు మంజూరు చేయాలని నిబంధన పెట్టింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీన్ని అమలు చేయడానికి కొత్త మార్గదర్శకాలపై ఉపాధి హామీ సిబ్బంది, కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఇంకుడు గుంతలు, చెరువుల్లో పూడికతీత, పొలాలను చదును చేయడం, నర్సరీల పెంపకం, మొక్కలు నాటడం తదితర 345 రకాల పనులు చేస్తున్నారు. వీటిలో ప్రధానంగా నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెరుగుదల పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

# కొండా భూమికి ఎసరు!

ఆసిఫాబాద్: కొండా లక్ష్మణ్ బాపూజీ జిల్లాతోపాటు.. రాష్ట్రంలోనే పరిచయం అక్కరలేని సమరయోధుడు. నిజాం నిరంకుశ విధానాలతో పోరాడి.. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తొలిదశలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యజించారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్న మహానుభావుడు.. తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఏదైనా చేద్దామనే సంకల్పంతో ట్రస్టును స్థాపించి, దాని కోసం భూమిని సైతం కొనుగోలు చేశారు. ఇందులో అనాథ శరణాలయం లేదా వృద్ధాశ్రమం స్థాపించాలనే ఆలోచనలో ఆయన ఉండేవారు. ఆ రెండు ఎకరాల స్థలం ప్రస్తుతం నాలుగు వరుసల రహదారి పక్కనే ఉంది. దీంతో ఒక్కసారిగా ఈ ప్రాంత పరిసర భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆ రెండెకరాల స్థలాన్ని కొందరు విక్రయించుకుని సొమ్ము చేసుకుందామనుకున్నారు. ఇందుకు ఓ రాజకీయ నేతను సంప్రదించారు. ఇలాంటి భూములను కొనడం, పట్టా చేసుకోవడంలో పేరుగాంచిన సదరు వ్యక్తి రూ.1.80 కోట్లకు ఒప్పందం చేసుకున్నాడు.భూమి కొనుగోలు చేస్తున్నట్లుగా బాండు పేపర్ మీద రాసుకున్నారు. ఈమేరకు ఆడియో రికార్డులు వైరల్



కావడం విషయం బయటకు పొక్కడంతో స్థానికులు విస్తుపోయారు. స్వాతంత్ర్య సమరయోధుడి భూమిని సైతం కాజేసే ప్రయత్నం చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో గ్రామస్థులు బుధవారం ధర్నా సైతం చేపట్టారు. వాంకిడి మండలంలో సర్వే నంబర్ 83బీ లో రెండు ఎకరాల స్థలాన్ని కొండా లక్ష్మణ్ బాపూజీకి చెందిన ట్రస్ట్ వ్యక్తులు 2011లో రూ.8 లక్షలకు బొట్టుపల్లి బాపు నుంచి కొనుగోలు చేశారు. అయితే ట్రస్ట్ పేరుతో మార్పిడి చేయలేదు. వాంకిడికి చెందిన ఆశోక్ పేరు మీదే ఇప్పటికీ రెవెన్యూ రికార్డులు, కొత్త పాస్‌పుస్తకం ఉన్నాయి.

పరిహారం, రైతుబంధు నగదు సైతం

కెరమెరికి చెందిన ఓ నేత ఈ భూమిని కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారు. సదరు వ్యక్తితో రూ.1.80 కోట్లకు బేరం కుదరడంతో రూ.40 లక్షలు ముందస్తుగా చెల్లించారు. మహనీయుడి భూమిని కొనుగోలు చేసే ముందు ఎలాంటి వివాదాలు లేకుండా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాల్సిన నేత, తనకు అలవాటైన తీరుతోనే భూమిని కాజేసే ప్రయత్నం చేశారు. మరోవైపు ప్రస్తుతం ట్రస్ట్ పేరుతో కాకుండా ఓ వ్యక్తి మీద ఈ భూమి ఉండటంతో.. నాలుగు వరుసల రహదారి విస్తరణలో ఈ సర్వే నంబర్‌లో కొంత భూమి కోల్పోగా రూ.4 లక్షల వరకు పరిహారం, రైతుబంధు డబ్బులు సదరు వ్యక్తే కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సదన్‌కు (ట్రస్టీకి) సంబంధం లేకుండా తీసుకోవడం గమనార్హం.

ఆయన కన్ను పడితే అంతే..

బినామీ పేర్లతో వందలాది ఎకరాల గిరిజన భూములను స్వాధీనం చేసుకున్న నేత.. డిమాండ్ ఉన్న భూములకు సంబంధించి ధర ఎంతైనా చెల్లించి ప్రభుత్వ, వివాదాస్పద భూములను కాజేయడంలో దిట్టగా పేరుంది. కొందరు అధికారులను మచ్చిక చేసుకుని లావాదేవీలు నడిపిస్తారనే ప్రచారం సైతం ఉంది. వాంకిడి మండలంలో రూ.కోట్ల విలువైన స్థలం తీసుకుని, ట్రస్ట్‌కు మరో చోట నామమాత్రపు ధరతో వచ్చే భూమిని కట్టబెట్టి, అప్పుడు ట్రస్ట్ పేరుతో రికార్డులు బదలాయించాలనేది కుట్రదారుల ఆలోచన. ప్రస్తుతం విషయం బయటకు రావడంతో అందరూ తేలు కుట్టిన దొంగల్లా గమ్మునున్నారు.

# పనులు చేపట్టి.. పక్కన పెట్టి..

మంచిర్యాల : మంచిర్యాల పురపాలక సంఘంలో ప్రజాప్రతినిధులే బినామీ గుత్తేదారులు కావడంతో అభివృద్ధి పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. టెండర్లు పొందిన వారు గడువు తీరినా పనులు చేయడంలేదు. ఇక్కడ 46 మంది గుత్తేదారులు ఉండగా.. రెగ్యులర్‌గా పనులు చేసే వారు 20 మంది ఉన్నారు. వీరిలో సగం మంది ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, కౌన్సిల్ సభ్యులే బినామీ గుత్తేదారులు. ఫలితంగా పట్టణం ప్రజలు మౌలిక వసతులకు దూరమవుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతాలకు ప్రధాన కేంద్రమైన మంచిర్యాలలో రోజురోజుకు భవన నిర్మాణ రంగం విస్తరిస్తోంది. కొత్త కాలనీలు పెరుగుతున్నాయి. ఇక్కడ వివిధ పన్నుల రూపంలో బల్దియాకు ఏటా భారీగా ఆదాయం వస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కూడా నిధులు వస్తున్నాయి. వీటితో ప్రతి నెలా అభివృద్ధి పనులు చేయడానికి అధికారులు టెండర్లు నిర్వహించి గుత్తేదార్లకు పనులు అప్పగిస్తున్నారు. పనులు పొందిన వారు రాజకీయ నాయకులతో సంబంధం ఉండటంతో.. పెండింగ్ పనులు చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రెండు మూడేళ్ల కిందట పనులు పొందిన వారు ఇప్పటికీ పూర్తి చేయడంలేదు. ఇక్కడ 36 వార్డులు ఉండగా.. శివారు ప్రాంతాలు, కొత్త కాలనీవాసులకు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు.

పట్టణంలో పనులు చేయడానికి ఒక్కొక్క వార్డుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల చొప్పున ప్యాకేజి కింద నిధులు కేటాయించారు. ప్యాకేజి టెండర్లతో చిన్న గుత్తేదార్లకు టెండర్లు దక్కకుండా పోయాయి. రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారే పనులు తీసుకుని నిర్మాణాలను మధ్యలో వదిలేస్తున్నారు. ఈ మధ్య కాలంలో వివిధ రకాల నిధులతో దాదాపు రూ.12.72 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి టెండర్లు నిర్వహించి గుత్తేదార్లకు అప్పగించగా.. ఇప్పటికి రూ.6.36 కోట్ల పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగతా సగం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేయాల్సిన రూ.4 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.9.02 కోట్లతో టెండర్లు నిర్వహించారు. వీటి టెండర్ షెడ్యూలు తెరచి గుత్తేదార్లకు పనులు అప్పగించాల్సి ఉంది. పనిచేయని గుత్తేదార్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి పెండింగ్ పనులు పూర్తి చేయించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.మంచిర్యాల పురపాలక కమిషనర్ బాలకృష్ణ ఇటీవల గుత్తేదార్లతో సమావేశం నిర్వహించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. అభివృద్ధి పనులు చేయడంలో అదే నిర్లక్ష్యం కొనసాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు సంబంధించిన బినామీ గుత్తేదార్లను అధికారులు ఒత్తిడి చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా పట్టణ ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది.




## కోర్టు కేసులు తేలాకే.. రాజధాని ఇళ్ల నిర్మాణానికి నిధులు: కేంద్రం

రాజధాని అమరావతిలో బయటి ప్రాంతాలకు చెందిన 47 వేల మందికి ఇళ్లనిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం షాక్ ఇచ్చింది. కోర్టు కేసులు తేలిన తర్వాతే ఇళ్ల సంగతి చూద్దామని స్పష్టం చేసింది. అది కూడా ఇళ్ల పథకం గడువు ముగిసేలోగా కేసులు పరిష్కారమైతేనే నిధులిస్తామని షరతు విధించింది. లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే సొంత ఖర్చుతో ఇళ్లు నిర్మించాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.




దిల్లీ: తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త సీజేల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఏపీకి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, తెలంగాణకు జస్టిస్ అలోక్ అరదేను కొలీజియం సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అలోక్ అరదే.. 2009లో అక్కడి హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2018 నవంబర్ నుంచి కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ 2013లో అక్కడి హైకోర్టుకు జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 2022 జూన్ నుంచి బాంబే హైకోర్టు జడ్జిగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను మణిపుర్ హైకోర్టు సీజేగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. అది కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో దాన్ని కొలీజియం రద్దు చేసింది. తాజాగా ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సిఫార్సు చేసింది.

## అంబటికి షాక్ ఇచ్చిన ప్రధాన అనుచరుడు.. టీడీపీలో చేరిక



పల్నాడు : టీడీపీలో చేరికలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఇక నేడు మంత్రి అంబటి రాంబాబు ప్రధాన అనుచరుడు ఆయనకు షాక్ ఇచ్చి టీడీపీలో జాయిన్ అయ్యారు. కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వైసీపీ నేత బత్తుల ఆదినారాయణ టీడీపీలో చేరారు. సత్తెనపల్లి వైసీపీ లీగల్ సెల్‌కు బత్తుల ఆదినారాయణ అధ్యక్షుడిగా ఉన్నారు. మంత్రి అంబటి రాంబాబుకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. అలాగే ఏపీ కాపునాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆదినారాయణ పని చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. "ప్రముఖ న్యాయవాది, సత్తెనపల్లి వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు శ్రీ ఆదినారాయణ గారు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదినారాయణ గారిని చంద్రబాబు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాము. రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించడానికి.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలతో పాటు మేధావులు, న్యాయవాదులు కలిసి కట్టుగా కృషి చేయాలి" అన్నారు.






భోపాల్: ఆదివాసీ యువకుడిపై మూత్రం పోసిన ఘటన మధ్యప్రదేశ్‌లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. నిందితుడు ప్రవేశ్ శుక్లాను అరెస్టు చేయడంతోపాటు అతడి ఇంటిని ప్రభుత్వం కూల్చేసింది. ఈ క్రమంలోనే తాజాగా ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ .. బాధితుడి కాళ్లు కడిగారు. గురువారం బాధితుడిని భోపాల్‌లోని తన నివాసానికి పిలిపించిన సీఎం చౌహాన్.. స్వయంగా అతడి కాళ్లు కడిగారు. అనంతరం అతడిని పరామర్శించారు.

ఇలాంటి చర్యలను సహించేది లేదన్నారు. 'ఘటనకు సంబంధించిన వీడియో నన్నెంతో బాధించింది. ఈ విషయమై క్షమాపణలు కోరుతున్నా. ప్రజలే నాకు దేవుడితో సమానం' అని అతనితో తెలిపారు. ఈ తరహా దుశ్చర్యలను సహించేదే లేదని, రాష్ట్రంలోని ప్రతి పౌరుడి గౌరవం తన గౌరవమేనని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇక్కడి సీధీ జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ ఘటనను ప్రతిపక్షాలు ఖండించాయి. నిందితుడికి భాజపాతో సంబంధం ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ దాడులు మానవతకు సిగ్గుచేటని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. భాజపా విద్వేష సంస్కృతికి ఇది అద్దం పడుతోందన్నారు.

# ఇడుపుల పాయకు సీఎం జగన్, అక్కడే షర్మిల

## అన్నా, చెల్లెళ్ళ మధ్య ఏం జరగనుంది?





కడప : ముఖ్యమంత్రి జగన్ మూడు రోజుల కడప పర్యటన ఖరారైంది. ఈ నెల 8 నుంచి పదో తేదీ వరకు సీఎం జగన్ కడప జిల్లాలోనే ఉండనున్నారు. ఈ నెల 8న దివంగత వైఎస్సార్ జన్మదినం నాడు జగన్ ముందుగా కళ్యాణదుర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ఇడుపులపాయకు చేరుకుంటారు. అదే రోజు వైఎస్సార్ కు నివాళి అర్పించేందుకు అక్కడకు షర్మిల రానున్నారు.

కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం నడుమ షర్మిల ఇడుపులపాయ పర్యటన ఆసక్తి పెంచుతోంది. ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు నేరుగా వైఎస్సార్ ఘాట్ కు చేరుకొని తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించనున్నారు. ఆ తరువాత ఇడుపులపాయలోని ప్రార్థన మందిరానికి వెళతారు. అక్కడ సింహాద్రిపురం మండల నాయకులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 5:30 గంటలకు అక్కడి నుంచి ఇడుపులపాయలోని ఇంటికి వెళ్లనున్నారు. 9వ తేదీ ఉదయం ఇడుపులపాయ నుంచి బయలుదేరి గండికోటకు వెళ్లనున్నారు. ఒబెరాయ్ హోటల్ కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గండికోట వ్యూపాయింటు చేరుకోనున్నారు. గండికోట నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ఉదయం 10.50గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్ కు చేరుకుంటారు. పులివెందులలో నూతన మున్సిపల్ భవనాన్ని, సిటీ ఫారెస్ట్, గరండాల వంక, వైఎస్సార్ ఇస్తా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్, న్యూటెక్ బయోసైన్స్ లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 పులివెందులలోని ఆర్అండ్ బి అతిథి భవనానికి చేరుకుంటారు. పులివెందులలోని వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించనున్నారు. భాకరాపురంలోని హెలిప్యాడ్ కు చేరుకొని ఇడుపులపాయకు వెళ్లనున్నారు. అక్కడ మధ్యాహ్నం ప్రజా ప్రతినిధులతో మాట్లాడనున్నారు. సాయంత్రం ఇడుపులపాయలోని ఇంటికి వెళ్లనున్నారు. 10వ తేదీ ఉదయం ఇడుపులపాయ నుంచి కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. రోడ్డు మార్గాన కడపలోని రాజీవ్ మార్గ్ కు చేరుకుని రాజీవ్ పార్క్ తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 10వ తేదీన హెలికాప్టర్ ద్వారా కడప సమీపంలోని కొప్పర్తికి చేరుకుంటారు. అక్కడ అల్టిక్సన్ యూనిట్ ను ప్రారంభించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల్లో పాల్గొంటారు. అనంతరం కడప విమానాశ్రయానికి చేరుకుని మధ్యాహ్నం 12.15కు బయలుదేరి గన్నవరంకు వెళ్లనున్నారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా సింగిల్‌గా ఎదుర్కొంటాం: మంత్రి కారుమూరి



న్యూఢిల్లీ: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగిల్‌గా ఎదుర్కొంటామని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికలు ముందు వచ్చినా, వెనుక వచ్చినా మేము రెడీ.. అన్ని ఎన్నికల్లో సింగిల్ గానే పోటీ చేసి విజయం సాధించాం. గత ఎన్నికల కంటే ఈ సారి ఎక్కువ సీట్లు ఖాయం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే సీఎం జగన్ ఢిల్లీ పర్యటన" అని మంత్రి స్పష్టం చేశారు. "గత చంద్రబాబు ప్రభుత్వం పౌర సరఫరాల శాఖను దివాలా తీయించింది. 20 వేల కోట్ల అప్పులు చేసింది. వాటిని పసుపు, కుంకుమకు మళ్లించారు. ఆ అప్పులన్నీ మేము తీర్చి శాఖను మళ్లీ గాడిలో పెట్టాం. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశాం. ధాన్యం తడిసినా, నూక వస్తున్నా రైతులకు మద్దతు ధర ఇచ్చాం. కోటి 46 లక్షల మందికి మేము రేషన్ ఇస్తున్నాం. కేంద్రం కంటే అదనంగా 60 లక్షల కార్డులు ఇచ్చాం.. వాటికి కేంద్రం సాయం చేయాలని కోరాం. నీతి ఆయోగ్ దీనికి అనుకూలంగా సిఫారసు చేసింది" అని మంత్రి కారుమూరి అన్నారు.

## ఏబీ వెంకటేశ్వరరావుకు ఊరట.. సీఎస్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు




అమరావతి: ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఆర్జిత సెలవుల(ఈఎల్)పై విదేశాలకు వెళ్లేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. ఆయన విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఏబీవీకి అనుమతి నిరాకరిస్తూ సీఎస్ ఇచ్చిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసింది. విదేశీ పర్యటనకు అనుమతించాలని ఇటీవల సీఎస్‌కు ఏబీవీ దరఖాస్తు చేసుకున్నారు. ఆ అభ్యర్థనను సీఎస్ తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.




నెల్లూరు: మాజీ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ భూ అక్రమాలు, బినామీల పేరుతో చేసిన భూదందాల వివరాలు ఇవీ అంటూ లోకేశ్ మీడియాకు వెల్లడించారు. మంగళవారం నెల్లూరు నగరంలో జరిగిన బహిరంగ సభలో అనిల్ భూకబ్జాలు, అక్రమాల ద్వారా బినామీల పేర్లతో రూ.వేయి కోట్లు దోచుకున్నారని లోకేశ్ ఆరోపించారు. వాటికి సంబంధించిన ఆధారాలను బుధవారం కోవూరు నియోజకవర్గంలోని సాలుచింతలలో మీడియాకు విడుదల చేశారు. 'నాలుగేళ్లలో ఏం అభివృద్ధి చేశారో ఎమ్మెల్యే అనిల్ చెప్పాలి. అసలు ఆయనకు ఈసారి టికెట్ ఇస్తారో లేదో స్పష్టత లేదు. తాను అవినీతికి పాల్పడలేదని అనిల్ వేంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేయాలి' అని లోకేశ్ సవాల్ చేశారు.

**లోకేశ్ విడుదల చేసిన జాబితాలో ప్రధానాంశాలివీ..** దొంతాలివద్ద బినామీలు చిరంజీవి, అజంతా పేరుపై 50 ఎకరాలు. విలువ రూ.10 కోట్లు. నాయుడుపేటలో బినామీ పేర్లతో 58 ఎకరాలు, విలువ రూ.100 కోట్లు. ఇనుమడుగు వద్ద బినామీలు రాకేశ్, డాక్టర్ అశ్విన్ (అనిల్ తమ్ముడు) పేరుతో 400 అంకణాలు. విలువ రూ.33 కోట్లు. అల్లీపురంలో 4వ డివిజన్ కార్పొరేటర్, డాక్టర్ అశ్విన్ పేరుతో 42 ఎకరాలు. విలువ రూ.105 కోట్లు. ఇందులో 7 ఎకరాలు ఇరిగేషన్ భూమి. సాదరపాళెంలో డాక్టర్ అశ్విన్ పేరుతో 12 ఎకరాలు, విలువ రూ.48 కోట్లు. పెద్ద కాంట్రాక్టర్ నుంచి దశల వారీగా అనిల్ బినామీ చిరంజీవికి రూ.కోట్లు వచ్చాయి. బృందావనంలో శెట్టి సురేష్ అనే బినామీ పేరుతో 4 ఎకరాలు. విలువ రూ.25 కోట్లు. దామరమడుగులో బావమరిది పేరుతో 5 ఎకరాలు. విలువ రూ.5 కోట్లు. గూడూరు-చెన్నూరు మధ్యలో 120 ఎకరాలు. అందులోని 40 ఎకరాల్లో లేఅవుట్ వేశారు.

## తన తల్లిని అవమానించిన వారిని లోకేశ్ వదిలిపెట్టరు



అమరావతి: పరిపాలన చేతగాని అసమర్థుడిని ముఖ్యమంత్రిని చేస్తే నాలుగేళ్లలో ప్రజలకు నరకం చూపించారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు, యువత, మహిళల రోదనవేదన ఎక్కువైందన్నారు. రైతుల కన్నీళ్లు తుడిచి, యువత ఆశలకు జీవం పోసి, మహిళల వేదన తీర్చేది ఎప్పటికైనా చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు. జగన్ నొక్కే బటన్లకు ప్రజలు ఆశపడటం లేదని.. ఎన్నికల వేళ ప్రజలు నొక్కే బటన్‌తో జగన్ రెడ్డి శాశ్వతంగా రాష్ట్రం వదిలిపోతారన్నారు. తనతల్లిని అవమానించిన వారిని లోకేశ్ వదిలిపెట్టరని హెచ్చరించారు. లోకం తెలియనివాడని అవహేళన చేసిన లోకేశ్.. నేడు వైసీపీ ప్రభుత్వానికి నిద్రలేకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. జగన్‌కు చదువు చెప్పిన గురువు కూడా తన శిష్యుడు ఇంత ఉన్మాదిలా తయారవుతాడని ఊహించి ఉండరన్నారు. విద్యార్థులకు విద్యను, యువతకు ఉపాధిని దూరం చేసిన సైకో.. వారిని గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసల్ని చేసి, తన ఖజానా నింపుకుంటున్నారని విమర్శించారు. జగన్ పాలనలో పల్నాడులో జరిగిన దారుణాలు, రాయలసీమలో కూడా జరిగి ఉండవన్నారు. పట్టపగలే హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా ముఖ్యమంత్రి స్పందించరని.. ఎందుకంటే చేయిస్తున్నది ఆయనే కాబట్టి అని ఆరోపించారు. ఏపీ పోలీసులను అవమానించిన జగన్ రెడ్డి కోసం రాష్ట్ర పోలీస్ శాఖ ఎందుకు పనిచేస్తోందని ప్రశ్నించారు. తన అవసరం, స్వార్థం కోసం జగన్ రెడ్డి ఎవరినైనా బలి చేస్తారని... జగన్ రెడ్డి నవ్వు వెనక ఉండే విషాన్ని, దుర్మార్గపు ఆలోచనల్ని అధికారులు గ్రహించాలని హితవుపలికారు. జగన్ మెప్పుకోసం నిబంధనలు, చట్టాలకు అతీతంగా పనిచేసే అధికారులంతా టీడీపీ ప్రభుత్వంలో తగిన మూల్యం చెల్లించుకుంటారని యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు.

# సీతమ్మ డెబ్యూ ఫిక్సైంది!

మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ 'సీతారామం'లో సీత పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగతి తెలిసిందే. ఈ విజయంతో వెంటనే బిజీ హీరోయిన్ అవుతుందని భావించినా.. అది కాస్త ఆలస్యంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ నాని..విజయ్ దేవరకొండ సినిమాల్లో నటిస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మడికి మరో జాక్ పాట్ తగిలింది. ఇదే మూవ్ మెంట్ లో కోలీవుడ్ లో కూడా లాంచ్ అవుతుంది. అదీ అగ్ర దర్శకుడు మురగదాస్ సినిమాతో ఎంట్రీ ఇవ్వడం సంచలనంగా మారింది. అవును. మురగదాస్ కొత్త చిత్రంలో బ్యూటీ లాక్ అయినట్లు తెలుస్తోంది. శివ కార్తికేయన్ హీరోగా మురగదాస్ ఓ భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం పలువురి భామల్ని పరిశీలించి చివరిగా మృణాల్ ఠాకూర్ ని



ఎంపిక చేసారు. స్టోరీ నచ్చడం సహా పెద్ద సినిమాలో ఛాన్స్ రావడంతో మృణాల్ మరో ఆలోచన లేకుండా సైన్ చేసింది. ప్రస్తుతం మృణాల్ పై టెస్ట్ షూట్ నిర్వహించడానికి మురగదాస్ సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఇక్కడో ట్విస్ట్ ఉంది. టెస్ట్ షూట్ లో పాస్ అయితేనే అవకాశం. లేదంటే నిర్మోహ మాటంగా ప్రాజెక్ట్ నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. సాధారణంగా హీరోయిన్ల విషయంలో మురగదాస్ టెస్ట్ షూట్ లు నిర్వహించారు. ఆయన కథ అంతా హీరోల చుట్టూనే తిరుగుతుంది కాబట్టి...హీరోయిన్లకు అంత ప్రాధాన్యత ఉండదు. కానీ శివకార్తికేయన్ సినిమా లో హీరోయిన్ పాత్ర కి ప్రాధాన్య ఉండటంతో టెస్ట్ షూట్ వరకూ తీసుకురావడానికి మురగదాస్ కి చాలా సమయం పట్టిందిట. పాత్ర పరంగా యాప్ట్ అవుతుందని మృణాల్ని తీసుకున్నారు. అయితే టెస్ట్ తర్వాతనే మృణాల్ కొనసాగుతుందా? లేదా? అన్నది క్లారిటీ వస్తుందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. హీరో ఇమేజ్ బేస్ట్ చిత్రాల్లో స్టార్ హీరోయిన్ తీసుకుంటే వాళ్లకి ఎలాంటి టెస్ట్ షూట్ ఉండదు.

కానీ మృణాల్ కెరీర్ ఈ మధ్యనే మొదలవ్వడంతో టెస్ట్ షూట్ కూడా అనివార్యమని భావించినట్లు తెలుస్తోంది.

# కియరా రెడ్ హాట్ కిల్లర్ లుక్

టాలీవుడ్ బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది కియరా అద్వాణీ. ఇప్పుడు ఆస్కార్ విన్నింగ్ ఆర్.ఆర్.ఆర్ నటుడు.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'(ఆర్.సి 15) లోను నటిస్తోంది. ఈ సినిమాతో కియరా పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకోనుంది. తనకు తానుగానే గేమ్ ఛేంజర్ గా దూసుకుపోయేందుకు ఇంకెంతో సమయం లేదని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అసాధారణ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తూ నేటితరం నాయికల్లో క్రేజీ ఎర్నర్ గా గుర్తింపు తెచ్చుకున్న కియరా ఒక్కో సినిమాకి 3-4 కోట్లు వసూలు చేస్తోంది. హిందీ పరిశ్రమలో పారితోషికం పరంగా మరో మెట్టు పైనే ఉందని తెలిసింది. అలాగే సోషల్ మీడియా పోస్టింగులతోను నిరంతరం బజ్ క్రియేట్ చేస్తున్న కియరా ఈ వేదికలపైనా యాడ్ పోస్టింగులతో భారీగా ఆర్జిస్తోంది. మరోవైపు కియరా నిరంతరం కిల్లర్ హాట్ ఫోటోషూట్లతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. తాజాగా కియరా రెడ్ హాట్ లుక్ ని షేర్ చేయగా అది అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. రెడ్ థై స్లిట్ మఖమల్ డిజైనర్ ఫ్రాకులో కియరా



టూ హాట్ గా కనిపిస్తోంది. నిజానికి థై స్లిట్ ఎలివేషన్ ఇదే తొలిసారి కాదు. కానీ ఈసారి సంథింగ్ స్పెషల్ గా టూహాట్ గా కియరా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ఈ ఫోటోలను జోరుగా వైరల్ చేస్తున్నారు. ఇక ఇటీవలే తన ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడేసిన కియరా పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంది? అని ప్రశ్నించగా.. దానికి ఆసక్తికర సమాధానమిచ్చారు. సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వానీ ఇటీవల ముంబైలో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో తమ చిత్రాలలో అత్యుత్తమ నటనకు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అనంతరం కియారా అద్వానీని ముంబై విమానాశ్రయంలో ఒక ఫోటోగ్రాఫర్ "మేడమ్ ఆప్ కీ మ్యారేజ్ లైఫ్ కైసీ హై?" అని అడిగారు. కియారా మొదట్లో హాయిగా ఉందనే ఎక్స్‌ప్రెషన్ ఇచ్చింది. కెమెరా వైపు తన ముఖాన్ని తిప్పి గేట్ నుండి ప్రవేశించే ముందు "సబ్ సాహీ హై" అని చెప్పింది. షేర్షా-భూల్ భూలైయా 2-జుగ్ జగ్ జియో -గోవింద నామ్ మేరా లాంటి చిత్రాలలో తన నటనకు కియారా స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోగా.. షేర్షాలో తన పాత్రకు సిద్ధార్థ్ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నాడు. ఈ జంట షేర్షా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి బంధంతో ఒకటయ్యారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయిపోయారు. 2023 ఫిబ్రవరి 7 న జైసల్మేర్ - సూర్యగఢ్ ప్యాలెస్ లో వివాహం జరిగింది.




# ముగ్గురు భామలతో మల్టీస్టారర్ ఇంట్రెస్టింగ్!



సాధారణంగా ఏ పరిశ్రమలోనైనా స్టార్ హీరోల మల్టీస్టారర్ చిత్రాలు మాత్రమే తెరకెక్కుతుంటాయి. అదే పని ముగ్గురు స్టార్ హీరోయిన్లను పెట్టి చేస్తే అది పెద్ద సాహసం అవుతుంది. వాళ్లతో కేవలం లేడీ ఓరియేంటెడ్ చిత్రాలే ఎక్కువగా చేస్తుంటారు. అదీ వాళ్ల స్టార్ ఇమేజ్ పతాక స్థాయిలో ఉంటేనే సాధ్యమ వుతుంది. తాజాగా బాలీవుడ్ లో ముగ్గురు భామలతో ఓ మల్టీస్టారర్ కి రంగం సిద్ధమవుతోంది. కరీనా కపూర్.. టబు..కృతి సనన్ ప్రధాన పాత్రలో రాజేష్ కృష్ణన్ 'దిక్రూ' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ సినిమా స్టోరీ లైన కూడా రివీల్ అయింది. సాఫీగా సాగిపోతున్న ముగ్గురు మహిళా ఉద్యోగుల జీవితాల్లో ఒక అనుకోని సంఘటన..పెద్ద చిక్కులకు కారణమవుతుంది. వాటి నుంచి బయట పడటానికి ఆ ముగ్గురు తప్పుల మీద తప్పులు చేస్తుంటారుట. చివరి వారు ఆ కష్టాల నుంచి బయట పడ్డారా? లేదా? అన్నదే కథ అట. ఇందులో దిల్జిత్ దోసాంజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇందులో కొన్ని అడ్వెంచర్ సన్నివేశా లుంటాయని తెలుస్తోంది. ఇక సినిమాలో టబు..కరీనా కపూర్ ఇద్దరు సీనియర్ భామలే. చాలా సినిమాల్లో నటించిన అనుభవం ఉంది. దాదాపు స్టార్ హీరోలందరితోనూ పనిచేసారు. వెండి తెరపై కొన్ని సాహసోపేతమైన పాత్రలు చేసిన అనుభవం ఉంది. వీళ్లిద్దరితో కృతి సనన్ పోటీ పడాల్సి ఉంది. నటిగా ఇప్పుడిప్పుడే బిజీ అవుతుంది. ఇలాంటి తరుణంలో గొప్ప పాత్ర పోషించే అవకాశం దక్కింది. ఇద్దరు సీనియర్లతో కలిసి పనిచేసే ఛాన్స్ వచ్చింది. మరి ఆ ఇద్దరితో అమ్మడి ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. ఇటీవలే కృతిసనన్ నటించిన ఆదిపురుష్ ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇక 'ది క్రూ' వచ్చే ఏడాది మార్చిలో సినిమా విడుదల కానుంది. అప్పటివరకూ సినిమా షూటింగ్..పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతాయని తెలుస్తోంది. ఏక్తకపూర్-రియా కపూర్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# హీరోయిన్స్ మల్టీస్టారర్ మూవీకి అన్నీ కష్టాలే



బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ అనగానే గుర్తుకు వచ్చే పేర్లలో ప్రియాంక చోప్రా.. ఆలియా భట్.. కత్రీనా కైఫ్. ఈ ముగ్గురు కలిసి నటిస్తే.. ఒక లేడీ ఓరియంటెడ్ కమర్షియల్ సినిమా చేస్తే ఎలా ఉంటుందో అనే ఊహ అద్భుతంగా ఉంది కదా.. ఈ కాంబోలో ఒక సినిమా కు ఫర్హాన్ అక్తర్ ప్రయత్నాలు చేశాడు. 2021 సంవత్సరంలో అతడు జీ లే జరా అనే సినిమాను ప్రకటించాడు. ముగ్గురు స్టార్ హీరోయిన్స్ ను నటింపజేస్తున్నట్లుగా ప్రకటన వచ్చింది.

ముగ్గురు ముద్దుగుమ్మలు కూడా నేను ఓకే అంటే నేను ఓకే అంటూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. కానీ తీరా షూటింగ్ సమయం దగ్గరకు వచ్చేప్పటికి అంతా కూడా నా వల్ల కాదు అన్నట్లుగా తప్పుకుంటున్నారు. ఇప్పటికే ప్రియాంక చోప్రా మరియు కత్రీనా కైఫ్ లు సినిమా నుంచి తప్పుకుంటున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. కారణం సినిమా షూటింగ్ ఆలస్యం అవ్వడంతో ఇతర ప్రాజెక్ట్ లతో ముందస్తుగా కమిట్ అయ్యి ఉండటం వల్ల జీ లే జరా సినిమాకు డేట్లు ఇచ్చే పరిస్థితి లేదు అంటూ వారి సన్నిహితులు బాలీవుడ్ మీడియాకు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నట్లుగా తెలుస్తోంది. 2024 సంవత్సరంలో జీ లే జరా సినిమాను మొదలు పెట్టాలని దర్శకుడు ఫర్హాన్ అక్తర్ భావించాడు. కానీ సినిమా నుండి మెయిన్ లీడ్ హీరోయిన్స్ తప్పుకోవడంతో ఆయన ఏం చేస్తాడు అంటూ అంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా హీరోల మల్టీస్టారర్ వస్తే సందడే సందడి ఉంటుంది. అలాంటిది ముగ్గురు స్టార్ హీరోయిన్స్ మల్టీ స్టారర్ అనగానే అంత కూడా ఆసక్తి కనబర్చారు. కానీ ఇప్పుడు ఆ సినిమా నుండి హీరోయిన్స్ తప్పుకుంటున్న నేపథ్యంలో సినీ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రైవేట్ పార్ట్స్ పై రచ్చ. అనసూయ కామెంట్స్..!

టాలీవుడ్ హాట్ యాంకర్ అనగానే ముందుగా అనసూయ పేరు వినపడుతుంది. జబర్దస్త్ కామెడీ షోకి యాంకర్ గా ప్రయాణం మొదలుపెట్టిన ఆమె ప్రస్తుతం టాలీవుడ్ బిజీ నటిగా మారిపోయింది. ఎప్పుడైతే రంగస్థలం సినిమా చేసిందో అప్పటి నుంచి ఆమెకు వరసగా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. నటిగా తన కెరీర్ కి ఉపయోగపడే పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. ఇదంతా ఓ వైపు అయితే ఆమె నిత్యం ఏదో ఒక వివాదాల్లో చిక్కుకుంటూనే ఉంటుంది. ఇక మరోసారి ఊహించని విధంగా రియాక్ట్ అయిన అనసూయ వార్తల్లో నిలిచింది. ఇంతకీ అసలు మ్యాటరేంటంటే ఇటీవల యాంకర్ రష్మి గౌతమ్ హిందూ మతం గురించి కామెంట్ చేసింది. హిందూ మతం కులాలు మత మార్పిడుల టాపిక్స్పై రీసెంట్గా కొన్ని కాంట్రవర్సీ కామెంట్స్ చేసింది. దీనిపై కొందరు ఆమెతో వాగ్వాదానికి



దిగారు. అయితే ఈ విషయంలో ఆమె ధైర్యంగా మాట్లాడటంపై ఓ అభిమాని తనను ప్రశంసిస్తూ ట్వీట్ చేశాడు. 'బాల్స్ కలిగిన సినీ పరిశ్రమకు చెందిన కొందరు వ్యక్తులు ఇలాంటి టాపిక్స్ మాట్లాడుతున్నారు' అంటూ ట్వీట్లో అనసూయ పేరు మెన్షన్ చేశాడు. అయితే సదరు ట్వీట్లో అనసూయ ప్రస్తావన తీసుకురావడం అసలు వివాదానికి కారణమైంది. తన ప్రస్తావన తీసుకురావడంతో అనసూయ కూడా వెంటనే రియాక్ట్ అయ్యింది. రియాక్ట్ అవ్వడమే కాకుండా ప్రైవేట్ పార్ట్స్ గురించి మెన్షన్ చేస్తూ అనసూయ కామెంట్ చేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. తనకు బాల్స్ లేవని కానీ తనకు పూర్తిగా తెలిసిన విషయాలపై మాట్లాడటానికి V**** ఉందని ఆమె అన్నారు. అలాగే మనలో ప్రతి ఒక్కరికీ వివిధ రకాల టాపిక్స్పై అటెన్షన్ ఉంటుందని ఇక్కడ చాయిసెస్ అనేవి పూర్తిగా వ్యక్తిగతమన్నారు. అందరూ ఒకేలా స్పందించాలనుకోవడం న్యాయం కాదు అంకుల్ అంటూ అనసూయ కామెంట్స్ చేశారు. ఇప్పుడు అనసూయ ట్వీట్ తీవ్ర దుమారం రేపుతోంది. కొందరు ఆమె ధైర్యానికి ఫిదా అయిపోతున్నారు. బలే ఆన్సర్ చెప్పారు అంటూ ప్రశంసిస్తున్నారు. కానీ కొందరు మాత్రం ఇవేమి కామెంట్స్ మరీ ఇంత బోల్డ్ గా సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# టాప్ లెస్ డ్రెస్ లో థైస్ ఎక్స్ ఫోజ్ చేసి కన్నుల విందు

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. తెలుగు లో ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా అప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మడు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేసినా.. వీడియోలు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి నాని హీరోయిన్ వాణి కపూర్ హాట్ ఫొటో షూట్ షేర్ చేసిన అభిమానులతో పాటు అందరిని కూడా షాక్ అయ్యేలా



చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈ మధ్య కాస్త బిజీగా సినిమాలు చేస్తోంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా ఫిజిక్ విషయంలో ఈ అమ్మడి తర్వాతే మరెవరైనా అన్నట్లుగా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు మోస్ట్ వాంటెడ్ అన్నట్లుగా ఉంటూ.. రొమాంటిక్ సన్నివేశాల్లో ఎలా నటించినా కూడా ఆహా అనిపించే విధంగా ఉండే వాణి కపూర్ ఈ ఫొటోలు చాలా మంది గుండెలకు గుచ్చుకుంటున్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాప్ లెస్ సింగిల్ పీస్ డ్రెస్ లో ఈ అమ్మడు థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చేసిన ఫొటో షూట్ కు సాధారణంగానే అంతా కూడా ఫిదా అవ్వాల్సిందే. అలాంటిది వాణి కపూర్ వంటి అందాల ముద్దుగుమ్మ షేర్ చేస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# మోదీ వరంగల్ పర్యటన.. ప్రధానికి కేసీఆర్ ఆహ్వానం పలుకుతారా?

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న తెలంగాణ పర్యటనకు రానున్న విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తాజాగా ప్రోటోకాల్ ప్రకారం మోదీ వరంగల్ పర్యటనకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. అయితే మోదీ పర్యటనకు కేసీఆర్ హాజరవుతారా లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. అవకాశం వచ్చిన ప్రతిసారీ కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ నేతలందరూ మోదీ నేతృత్వంలోని బీజేపీపై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధానికి సీఎం స్వాగతం పలుకుతారా? మోదీతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే గతంలోనూ పలుమార్లు ప్రధాని తెలంగాణకు వచ్చినప్పుడు ఆహ్వానం అందినా కూడా సీఎం కేసీఆర్ లేదు. అన్ని సందర్భాల్లోనూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రధానికి ఆహ్వానం పలికి, వీడ్కోలు పలికేవారు. దీంతో ఈసారైనా కేసీఆర్ వస్తారా? లేక మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుందా? అనే చర్చ నడుస్తోంది. కాగా జూలై 8న ప్రధాని వరంగల్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుడంతోపాటు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, రహదారుల పనులకు భూమిపూజ, కాజీపేటలో రైల్వే వ్యాగన్ల యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటనలో ప్రధాని రాష్ట్రంలో రూ.6,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

చదవండి: ఢిల్లీలోనే బండి సంజయ్.. రఘునందన్‌రావుపై చర్యలు?

**ప్రధాని షెడ్యూల్ ఇదే :** ఈ నెల 8 ఉదయం 9:45 కు హకీం పేట్ ఎయిర్ పోర్టుకు రానున్నారు. 10:45 గంటలకు వరంగల్‌కు చేరుకుని రూ.5,55 0 కోట్ల వ్యయంతో చేపట్టే 176 కి.మీ జాతీయ రహదారి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ కింద 108 కిలోమీటర్ల మంచిర్యాల-వరంగల్ సెక్షన్ ఇందులో భాగంగా ఉంది. దీనివల్ల మంచిర్యాల-వరంగల్ మధ్య 34 కి.మీ దూరం తగ్గుతుంది. 44, 65 జాతీయ రహదారులపై వాహన రద్దీ తగ్గుతుంది. దీంతోపాటు కరీంనగర్-వరంగల్ సెక్షన్‌లో 68 కి.మీ మేర 2 వరుసలుగా ఉన్న రహదారిని 4 వరుసలుగా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేస్తారు. హైదరా బాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేటలో రూ. 500 కోట్లతో చేపట్టనున్న రైలు వ్యాగన్ల తయారీ కర్మాగారం నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేస్తారు.

# ప్రతిపక్షాలు ఎన్నికల వ్యూహాల్లో..!

## రాబోయే తరాలకు మౌలిక కల్పించడంలో సీఎం కేసీఆర్ బిజీ.. మంత్రి కేటీఆర్!

హైదరాబాద్ : సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో కొత్తగా కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ట్విట్టర్ వేదికగా గురువారం స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రంలో 33 జిల్లాలు జిల్లాకు మెడికల్ ఉన్నట్లు అయ్యిందని తెలిపారు. అలాగే ప్రతి జిల్లాకు ఓ నర్సింగ్ కాలేజ్, 500 పడకల ఆసుపత్రి ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా ఇలా లేదని, ఏ ఒక్క రాష్ట్రం సైతం తెలంగాణకు దరిదాపుల్లో లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇదంతా సీఎం కేసీఆర్ దార్శనికతతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రత్యర్థులు వచ్చే ఎన్నికల కోసం ప్రణాళికలు రచించడంలో నిమగ్నమై ఉంటే.. మన ముఖ్యమంత్రి మాత్రం రాబోయే తరానికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో బిజీగా ఉన్నారంటూ ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువవడంతో పాటు గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు



సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరింది. 2014నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే.. ఇప్పుడా సంఖ్య 8,340 సీట్లకు చేరింది.

# మాపై దుష్ప్రచారం చేస్తున్నారు: ఈటల ఆగ్రహం



హనుమకొండ: తెలంగాణలో భాజపాపై కొందరు విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారని భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మండిపడ్డారు. భాజపా, భారాస ఒక్కటయ్యాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్‌లో జులై 8న ప్రధాని మోదీ సభ నేపథ్యంలో హనుమకొండలో ఈటల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా చాలా బలంగా ఉందని.. చాపకింద నీరులా పార్టీ విస్తరిస్తోందని ఈటల చెప్పారు. ఠక్కున పైకి వెళ్లి పడిపోవడానికి.. భాజపా బలమేమీ సెన్సెక్స్ కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ గడ్డపై తమ విజయపరంపర 2019 ఎంపీ ఎన్నికలతో మొదలైందన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటామని చెప్పారు. మునుగోడులోనూ నైతికంగా భాజపానే గెలిచిందన్నారు. ప్రధాని పర్యటనపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారని తెలిపారు. పార్టీ యంత్రాంగమంతా ప్రధాని సభను విజయవంత చేస్తుందన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్‌లను జన బలంతో కొట్టాలి..

హైదరాబాద్: ఎన్నికల్లో వచ్చిన మార్పులు, సాంకేతికతను బీజేపీ, బీఆర్ఎస్‌లు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయని.. దీన్ని కాంగ్రెస్ అధిగమించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ గతంలో గ్రామపెద్ద ఏ గుర్తు చెబితే ఆ గుర్తుకు గ్రామ ప్రజలు ఓటు వేసేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిందని అన్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలను దాటి.. ఏజెన్సీలు వచ్చాయని, ఏజెన్సీలను నియమించుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. ఈ దేశంలో అత్యంత పేద పార్టీ కాంగ్రెస్ అని.. పార్టీ ఏ రకమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యాయని, బీజేపీ, బీఆర్ఎస్‌లను జన బలంతో కొట్టాలని రేవంత్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లా కమిటీలను రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. జులై 25లోగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని కమిటీలు పూర్తి చేస్తామన్నారు.




ప్రభుత్వ ఉద్యోగులను అధికార పార్టీ తమ పార్టీకి అనుకూలంగా పనిచేయించుకుంటోందని, ఇది ఓ రకంగా అధికార దుర్వినియోగమని అన్నారు. గ్రామ స్థాయిలోనే కాంగ్రెస్ అనుకూల, వ్యతిరేక ఓట్లను గుర్తించాలన్నారు. ఆగస్టు 18న హైదరాబాద్ మండల అధ్యక్షులకు ట్రైనింగ్ కార్యక్రమం ఉంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

# చెట్టుకు పుట్టిన రోజు వేడుక చేసిన మంత్రి వేముల

హైదరాబాద్ : అభివృద్ధి, సంక్షేమంలో అగ్రపథంలో దూసుకెళ్లున్న తెలంగాణ రాష్ట్రం పచ్చదనంలోనూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది. సీఎం కేసీఆర్ దార్శనికతతో చేపట్టిన హరితహారం కార్యక్రమం పుడమి తల్లికి పచ్చని కోకను బహుమతిగా అందించినట్లయింది. నేడు పెరిగిన అటవీ విస్తీర్ణం..ఆకుపచ్చని అందాలతో తెలంగాణ రాష్ట్రం ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. హరితహారంలో భాగంగా సరిగ్గా 8 సంవత్సరాల క్రితం (6-7-2015) వ తేదీన మొదటి విడత హరిత హారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిజామా బాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి ఆవరణలో నాటిన మొక్క నేడు 8 సంవత్సరాలు పూర్తి చేసుకొని 9 వ వసంతంలోకి అడుగిడింది. ఈ సందర్భంగా.. ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి కేక్ కట్ చేసి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమం చాలా గొప్ప నిర్ణయం అని అన్నారు. ఇది ఓట్ల కోసం చేసేది కాదని భావి తరాల భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమం అని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణపైనే సమస్త మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు హరితహారం కార్యక్రమం చేపట్టి కోట్లాది మొక్కలు నాటించారన్నారు. ప్రపంచం మొత్తం అడవుల శాతం తగ్గిపోతుంటే మన తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యల వల్ల 7.7 శాతం అడవులు పెరిగాయి అని తెలిపారు. మొక్కలు నాటి సంరక్షించడం మన అందరి బాధ్యత అని మంత్రి గుర్తు చేశారు. మొక్కలు నాటడంతో సకాలంలో వర్షాలు కురుస్తాయని మంత్రి పేర్కొన్నారు.




ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న వరంగల్‌కి రానున్నారు. రెండు రోజుల పాటు వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో రూ.6 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. రైలు వ్యాగన్ల తయారీ కేంద్రంతో పాటు పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేయనున్నారు.




ధర్మసాగర్ : స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య తనను లైంగికంగా వేధింపులకు గురి చేశారని సర్పంచి నవ్య ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి ఆధారాలు లేవని జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. తనను రాజయ్య లైంగికంగా వేధింపులకు గురి చేశారని ఆరోపిస్తూ హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం సర్పంచి కురుసపల్లి నవ్య మార్చి 10న విలేకర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీన్ని అప్పుడే జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. ఈ విషయంపై సర్పంచి నవ్యను వివరణ కోరగా తాను ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు పెట్టలేదని చెప్పారు. మహిళా కమిషన్ల ఆధ్వర్యంలోనే కేసును నడిపిస్తామని.. రాజీపడలేదని నవ్య, ఆమె భర్త ప్రవీణ్ తెలిపారు.

# బండికి కేంద్ర మంత్రి పదవి.. ఢిల్లీ వర్గాల మాట!



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ నేత ఫైర్ బ్రాండ్ నాయకుడు ఎంపీ బండి సంజయ్ను రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే.. ఆయన సేవలకు మరింత గుర్తింపు వస్తుందని ఢిల్లీ బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో బండి సారథ్యంలో కీలక నేతలను పార్టీలో చేర్చుకోవడంతోపాటు.. ఆయన చేసిన సంగ్రామ యాత్ర ద్వారా పార్టీని బలోపేతం చేయడం వరకు కూడా పార్టీ అదిష్టానం ఆయన సేవలను గుర్తుంచుకుందని అంటున్నారు. ముఖ్యంగా అరెస్టు చేసిన సమయంలోనూ పార్టీ తరపున ఆయన పని చేశారని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ వంటి ఫైర్ బ్రాండ్ నాయకులను బీజేపీ అధిష్టానం వదులుకునే ప్రయత్నం చేయదని.. ఆయనను పక్కన కూడా కూర్చోబెట్టదని ఢిల్లీ కమలం పార్టీ పెద్దలకు అత్యంత సన్నిహితంగా ఉండే కొందరు నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్కు కేంద్ర మంత్రి పదవి ఖాయమని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ పగ్గాలు చేపట్టిన కిషన్ రెడ్డి ఇప్పటి వరకు కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ(ఇండిపెండెంట్) మంత్రిగా వ్యవహరించారు. ఇప్పుడు ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన దరిమిలా.. ఆశాఖను బండికి ఇచ్చే అవకాశం మెండుగా ఉందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదే జరిగితే.. తెలంగాణలో జరిగిన మార్పు కారణంగా బీజేపీ మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని ఢిల్లీ వర్గాల మాటగా వినిపిస్తోంది. సంజయ్ నేతృత్వంలో వివిధ ఉప ఎన్నికలను ఎదుర్కోవడం కీలకమైన హుజూరాబాద్ దుబ్బాక ఎన్నికలు ఎమ్మెల్సీ ఎన్నికలు జీహెచ్ఎంసీలో 48 స్థానాల్లో గెలుపు వంటి అంశాల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి అవకాశం లేకుండా బండికి కేంద్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించడం ఖాయమనే సంకేతాలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ కూడా పలు సందర్భాల్లో బండిని ప్రశంసించిన విషయాన్ని ఢిల్లీ వర్గాలు ప్రస్తావిస్తుండడం గమనార్హం.

# తెలంగాణలో మరో 14వేలకు పైగా ఇంజినీరింగ్ సీట్లకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్: తెలంగాణలో మరో 14,565 ఇంజినీరింగ్ సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. కోర్ గ్రూపుల్లో సీట్లు వెనక్కి ఇస్తామని పేర్కొంటూ ఇంజినీరింగ్ కాలేజీలు కంప్యూటర్ కోర్సుల్లో సీట్లకు అనుమతి కోరాయి. దీంతో 6,930 సీట్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అలాగే కొత్తగా 7,635 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఖరారు చేసింది. ఫలితంగా అదనపు సీట్లతో ఏటా సర్కారుపై రూ.27.39 కోట్ల భారం పడనుంది. ఇటీవల 86,106 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, తాజా అనుమతిచ్చిన వాటితో కలిపి రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య 1,00,671 చేరింది.



# ఘట్‌కేసర్ చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

హైదరాబాద్ : ఘట్‌కేసర్ చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. నిందితుడు సురేష్‌తో పాటు పోలీసులు అతని వద్ద పాపను గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. నిన్న సాయంత్రం మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈడబ్ల్యూఎస్ కాలనీలో కృష్ణవేణి (4) అనే చిన్నారి కిడ్నాప్ కలకలం రేపింది. పాప ఇంటి ముందు ఆడుకుంటుండగా సురేష్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లాడు. పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిన్నారి ఆచూకీ కోసం పోలీసులు స్పెషల్ పార్టీ టీం గాలింపు చర్యలు చేపట్టింది. చిన్నారిని కిడ్నాప్ వ్యవహారాన్ని సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో చిన్నారిని కిడ్నాప్ చేసి ఎక్కడికో తీసుకు వెళుతున్నట్టు అయితే కనిపించింది.

ఇక కిడ్నాపర్ సురేష్‌కి సంబంధించి కొన్ని ఫోటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. సురేష్.. ఒక్కో ఫోటోలో ఒక్కోలా కనిపిస్తున్నాడు. అయితే అతనికి ఇలా చిన్నారులను కిడ్నాప్ చేయడం కొత్తేం కాదని.. గతంలో కూడా సురేష్ ఒక అమ్మాయిని కిడ్నాప్ చేశాడని పోలీసులు తమ విచారణలో తెలుసుకున్నారు. అప్పట్లో తాను పని చేస్తున్న థియేటర్‌లో వచ్చిన ఒక అమ్మాయిని సురేష్ కిడ్నాప్ చేశాడు.

# మీ చర్యలతో.. దిల్లీ గొంతు నులిమేస్తున్నారు: కేజ్రీవాల్



దిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం మధ్య నిత్యం ఏదో ఒక వివాదం నడుస్తూనే ఉంది. తాజాగా వీకే సక్సేనా ఇచ్చిన ఉత్తర్వులను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. వాటితో దిల్లీ ప్రభుత్వం గొంతును నులిమేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్జీ బుధవారం మరోసారి వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేశారు. దానికింద దిల్లీ ప్రభుత్వంలోని నిపుణులు, సలహాదారులు ఎల్జీ అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహించకూదని వాటి సారాంశం. నేరుగా సక్సేనాకు నివేదించే సేవల విభాగం ఈ మేరకు అన్ని శాఖలకు లేఖలు పంపింది. దీనిపై కేజ్రీవాల్ ట్విటర్ వేదికగా స్పందించారు. ‘ఈ ఉత్తర్వులు దిల్లీ ప్రభుత్వం గొంతును పూర్తిగా నులిమేస్తాయి. ఇది ప్రభుత్వ పనితీరును పూర్తిగా అణచివేస్తుంది. ఈ నిర్ణయాలతో గౌరవనీయ ఎల్జీ ఏం సాధించాలనుకుంటున్నారు. సుప్రీం కోర్టు ఈ ఉత్తర్వులను కొట్టివేస్తుందని ఆశిస్తున్నాను’ అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదివరకు కూడా ఎల్జీ ఈ తరహా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆప్ సర్కారు వివిధ విభాగాల్లో నియమించిన 400 మంది సలహాదారులు/నిపుణులను ఎల్జీ ఏకపక్షంగా తొలగించారు. పారదర్శకత లేకుండా చేపట్టిన వారి నియామకాల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ వీకే సక్సేనా తన చర్యలను సమర్థించుకున్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమంటూ ఆప్ నేతలు మండిపడ్డారు. ఎల్జీ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. సలహాదారులు, నిపుణులను తొలగించే అధికారం ఆయనకు లేదన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com